ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

మంగళవారం 2 సెప్టెంబరు 2025

ఉక్కు ఉద్యోగులకు అందని జీతాలు

» మొత్తం బకాయిలు 430 శాతం



స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఉద్యోగులతో గొడ్డు చాకిరీ చేయించుకొని జీతాలు మాత్రం సక్రమంగా ఇవ్వడం లేదు. గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ పరిస్థితి నెలకొంది. రోజుకు 8 గంటలు డ్యూటీ కాగా ఇంకో నాలుగు గంటలు అదనంగా పనిచేస్తున్నా సరిగా జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమని ఉద్యోగులు, కార్మికులు వాపోతున్నారు.

-8లో

ఉద్యోగం ఇక్కడ... విధులు అక్కడ!

ఇదీ కనకమహాలక్ష్మి ఆలయం డీఈ తీరు

» సుదీర్ఘకాలం సింహాచలం దేవస్థానంలో విధులు

» ఆ కారణంతోనే ఇటీవల బదిలీ

» అయినా అప్పన్న ఆలయానికి వెళ్లిపోతున్న సదరు అధికారి

» ప్రొటోకాల్, దర్శనాలలో హడావిడి



సింహాచలం దేవస్థానంలో ఈవో పక్కనున్న కనకమహాలక్ష్మి దేవస్థానం డీఈ రామరాజు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)


కనకమహాలక్ష్మి ఆలయానికి చెందిన ఇంజనీరింగ్ అధికారి డీవీఎస్ రామరాజు (హరి) పోస్టింగ్ ఇచ్చినచోట కాకుండా వేరొకచోట పనిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన్ను సింహాచలం దేవస్థానం నుంచి వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి ఆలయానికి బదిలీ చేశారు. సుదీర్ఘకాలం సింహాచలం ఆలయంలో ఉన్నారనే కారణంతోనే మార్చారు. అయితే ఆయన ఇప్పటికీ సింహాచలంలోనే విధులు నిర్వహించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎటువంటి ఉత్తర్వులు లేకుండా వారానికి రెండు, మూడు రోజులు సింహాచలం వెళ్లి ప్రొటోకాల్, దర్శనాల వ్యవహారాలు చూస్తున్నారు. ఉద్యోగులు ఎక్కడకు బదిలీ అయితే అక్కడే పనిచేయాలి. ఆయన మాత్రం అందుకు ఇష్టపడడం లేదంటున్నారు. పైగా సింహాచలంలో నిత్యం ఈఓ పక్కనే ఉంటుంటారు. ప్రస్తుతం దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్రమోహన్ సింహాచలంలో ఈఓగా పనిచేసినప్పటి నుంచి రామరాజుకు అది అలవాటుగా మారిందని దేవస్థానం వర్గాల సమాచారం.

దేవస్థానంలోని ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో ఫిట్టర్‌గా రామరాజు విధుల్లో చేరారు. అక్కడి నుంచి ఎలా ఇంజనీరింగ్ విభాగంలోకి వచ్చారో తెలియదు గానీ ఏఈగా కొన్నాళ్లు పనిచేసి, డీఈగా పదోన్నతి పొందారు. ఆయన సర్టిఫికెట్లు సరైనవి కావని కొందరు జిల్లా కలెక్టర్‌కే నేరుగా ఫిర్యాదు చేశారు. దీనిపై శాఖాపరమైన విచారణ జరిగినా, నివేదిక బయటకు రాలేదు. ఆ తరువాత ఫిర్యాదు చేసిన వ్యక్తిని గుర్తించి దానికి వెనక్కి తీసుకునేలా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. రామరాజు ఎప్పుడూ ఈఓతోనే ఉండడం, పరిపాలన, ఆలయ పర్యవేక్షణ, ప్రొటోకాల్ పనుల్లో తలదూర్చడం వివాదాలకు కారణమవుతోంది.

ఈఈ రమణకు అదనపు బాధ్యతలు

సింహాచలంలో చందనోత్సవ సమయంలో గోడ కూలిన తరువాత ఈఈ శ్రీనివాసరాజును సస్పెండ్ చేశారు. అదేరోజున డీఈ నాగేశ్వరరావు రిటైర్ అయ్యారు. దాంతో ప్రభుత్వం కనకమహాలక్ష్మి దేవస్థానం ఈఈ సీహెచ్ రమణకు సింహాచలం ఈఈగా అదనపు బాధ్యతలు ఇచ్చింది. అలాగే అన్నవరం దేవస్థానం ఈఈకి కూడా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఇద్దరు ఈఈలు అడిషనల్ చార్జితో పనిచేస్తుండగా అసలు ఇంజనీరింగ్ వ్యవహారాలే ... మిగతా 6వ పేజీలో

నేడు సీఎం రాక



విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం నగరానికి రానున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 1.45 గంటలకు ఆర్కే బీచ్ రోడ్డులో గల కోస్టల్ బ్యాటరీ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. అక్కడ నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్లి ఈస్ట్‌కోస్ట్ మారిటైమ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో పాల్గొంటారు. సాయంత్రం 4.20 గంటలకు నోవాటెల్ నుంచి బయలుదేరి కోస్టల్ బ్యాటరీ వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకుని 4.30 గంటలకు హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరతారు.

నేడు రెండో దఫా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

» విమల విద్యాలయంలో ఏర్పాట్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులల్లో మరికొందరి సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం ఉక్కునగరంలోని విమల విద్యాలయంలో చేపట్టనున్నారు. దీనికి సంబంధించి పాఠశాల విద్యా శాఖ నుంచి జిల్లా విద్యా శాఖకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉక్కునగరంలోని విమల విద్యాలయంలో ఆరు కౌంటర్లు ఏర్పాటు చేసింది. ప్రతి కౌంటర్‌లో 50 మంది చొప్పున సుమారు 300 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావలసిన అభ్యర్థులకు కాల్‌లెటర్లు సోమవారం రాత్రికి అందే అవకాశం ఉంది.

డీఎస్సీ మెరిట్ జాబితా మేరకు ఉమ్మడి జిల్లాలో 1,139 పోస్టులకుగాను 1,138 మంది అభ్యర్థులు, జోన్-1లో 304 పోస్టులకు 304 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన గత నెల 25వ తేదీ నుంచి మూడురోజులపాటు విమల విద్యాలయంలో నిర్వహించారు. అయితే కొందరు అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపికయ్యారు. దరఖాస్తు చేసుకునే సమయంలోనే పోస్టులకు సంబంధించి ప్రాధాన్యతా క్రమంలో ఆప్షన్ ఇచ్చారు. దీని ప్రకారం ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపికైతే... ... మిగతా 6వ పేజీలో

కౌన్సిల్ తీర్మానానికి తిలోదకాలు!

» 'స్మార్ట్ సిటీ ప్రాజెక్టు' కాలపరిమితి ముగియడంతో రద్దుకు కార్పొరేటర్ల డిమాండ్

» స్మార్ట్ సిటీ కార్పొరేషన్‌కు ఇకపై పనులు అప్పగించడానికి వీల్లేదని, ఉన్న ప్రాజెక్టులను, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని పాలకవర్గం తీర్మానం

» ఇంజనీరింగ్ అధికారులకు ప్రత్యేకంగా మేయర్ ఆదేశాలు



మేయర్ పీలా శ్రీనివాసరావు



» అయినా స్మార్ట్ సిటీ కింద రూ.30 కోట్లతో

» వర్కింగ్ ఉమెన్‌హాస్టల్ నిర్మాణానికి టెండర్లు

» వివాదాస్పదమవుతున్న ఇంజనీరింగ్ అధికారులతీరు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానాన్ని ఇంజనీరింగ్ అధికారులు కనీసం పరిగణనలోకి తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'స్మార్ట్ సిటీ ప్రాజెక్టు'కు గడువు ముగియడంతో దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లో రద్దు చేశారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీలో కూడా స్మార్ట్ సిటీ ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేసి, ఆ కార్యాలయాన్ని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించాలని ఈ ఏడాది జూన్ ఆరున జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కౌన్సిల్‌లోనే ఇంజనీరింగ్ అధికారులకు మేయర్ పీలా శ్రీనివాసరావు స్పష్టంగా ఆదేశాలు జారీచేశారు. అయితే జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు మాత్రం కౌన్సిల్ తీర్మానంతోపాటు మేయర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ గాజువాకలో రూ.30 కోట్ల వ్యయంతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవన నిర్మాణం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టేందుకు రెండు రోజులు కిందట టెండర్ పిలిచారు.

జీవీఎంసీ పరిధిలో మధురవాడ, ముడసర్లోవ, గాజువాక ప్రాంతాల్లో రూ.174 కోట్ల వ్యయంతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల కిందట ఉత్తర్వులు జారీచేసింది. ఆ పనులను స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే జీవీఎంసీ పరిధిలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు వ్యవహారాలు చూసే గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (జీవీఎస్‌సీసీఎల్) కాలపరిమితి ముగియడంతో నేరుగా టెండర్లు పిలిచేందుకు అవకాశం లేకుండాపోయింది. దాంతో జీవీఎంసీ కౌన్సిల్ అనుమతి కోసం ఈ ఏడాది జూన్ ఆరున జరిగిన సమావేశం అజెండాలో వర్కింగ్ హాస్టళ్ల నిర్మాణం ప్రతిపాదనను పొందుపరిచారు. ఈ అంశంపై కౌన్సిల్‌లో చర్చ జరిగినప్పుడు స్మార్ట్ సిటీ కింద నగరంలో రూ.వేలకోట్ల విలువైన పనులు జరిగాయని, దీనిని పర్యవేక్షించే అధికారం జీవీఎంసీకి లేకుండా ఒక ప్రైవేటు ఉద్యోగికి అప్పగించడంతో పెద్దఎత్తున అవినీతి జరిగిందంటూ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. జీవీఎంసీలో ఎంతో అనుభవం కలిగిన నిపుణులైన ఇంజనీర్లు ఉండగా వారిని కాదని, ఒక ప్రైవేటు ఉద్యోగికి పర్యవేక్షణ అప్పగించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు గడువు ముగియడంతో దేశవ్యాప్తంగా నగరాల్లో రద్దు చేశారని, విశాఖలో ప్రైవేటు ఉద్యోగి రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని ఇంకా కొనసాగే ప్రయత్నం చేస్తున్నారని ... మిగతా 6వ పేజీలో

ఏయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కె.రాంబాబు



నియామక ఉత్తర్వులు అందిస్తున్న వీసీ

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్, ఫ్యాకల్టీ అఫైర్స్ డీన్‌గా సేవలందిస్తున్న ప్రొఫెసర్ కె.రాంబాబును నియమిస్తున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ప్రకటించారు. ప్రొఫెసర్ ధనుంజయరావు స్థానంలో ప్రొఫెసర్ రాంబాబును నియమించినట్టు పేర్కొన్నారు. ప్రొఫెసర్ రాంబాబుకు నియామక ఉత్తర్వులను వీసీ రాజశేఖర్ అందజేశారు. అనంతరం బాధ్యతలను స్వీకరించిన ప్రొఫెసర్ రాంబాబు మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలను అప్పగించిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో రెక్టర్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

4న స్టాండింగ్ కమిటీ సమావేశం

» 200 అంశాలతో అజెండా

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఎన్నికైన జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ తొలి సమావేశం ఈనెల నాలుగున నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు నిర్ణయించారు. స్టాండింగ్ కమిటీకి గతనెల ఆరున ఎన్నికలు జరగ్గా, కూటమి నుంచి తొమ్మిది మంది, వైసీపీ నుంచి ఒకరు గెలుపొందిన విషయం తెలిసిందే. కొత్తగా ఎన్నికైన కమిటీ తొలి సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు పాత కౌన్సిల్‌హాల్‌లో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. సమావేశంలో చర్చించేందుకు 200 అంశాలతో అజెండాను తయారుచేశారు. నగరంలో అభివృద్ధి పనులు, ఉద్యోగుల జీతభత్యాలు, పదోన్నతులు, మార్కెట్‌లు, దుకాణాల వేలానికి సంబంధించిన అంశాలను అజెండాలో పొందుపరిచారు.

వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలి

బదిలీల సమయంలో చాలామంది ఫోన్ చేస్తున్నారు

వ్యక్తిగత కారణాలు చెప్పి ట్రాన్స్‌ఫర్ నిలపాలని కోరుతున్నారు

ఆ తరహా సిఫారసులు నేను చేయను

» క్యాన్సర్‌ను నియంత్రించేందుకు నడుంబిగించిన ప్రభుత్వం

» చికిత్స కంటే ముందుగా గుర్తించడమే కీలకమన్న విధానంతో ముందుకు వెళుతున్నాం

» క్యాన్సర్ వల్ల ముగ్గురు కుటుంబ సభ్యులను కోల్పోయా

» అందుకే ఆ మహమ్మారిపై పోరాటం

» వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

» కేజీహెచ్‌లో అత్యాధునిక చికిత్సా పరికరాలు ప్రారంభం



వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కేజీహెచ్ వైద్యులు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, వైద్య విద్యార్థులు గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో అనుసంధానమై పనిచేయాలని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. కేజీహెచ్‌లోని కాంప్రెహెన్సివ్ క్యాన్సర్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన అత్యాధునిక పరికరాలను సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆంధ్ర మెడికల్ కళాశాల ఆవరణలోని సెంటినరీ అకడమిక్ బ్లాక్‌లో వైద్యులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బదిలీల సమయంలో ఎంతోమంది వైద్యులు తనకు ఫోన్లు చేస్తున్నారని, ... మిగతా 6వ పేజీలో

రెడ్ అలర్ట్

నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు

» జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన వాతావరణ శాఖ

» చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరిక

» కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్



విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఒడిశాకు ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో విశాఖపట్నం జిల్లాకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి విస్తారంగా, అక్కడక్కడా భారీ నుంచి అతిభారీవర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో జిల్లా యంత్రాంగాన్ని వాతావరణ శాఖ అప్రమత్తం చేసింది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. వాతావరణ శాఖ హెచ్చరికలతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు.జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్లకు అప్రమత్తం చేశారు. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడంపై అధికారులు ఇంకా నిర్ణయంతీసుకోలేదు. కాగా మంగళవారం మధ్యాహ్నం నోవాటెల్ హోటల్‌లో జరగనున్న మారిటైమ్ సదస్సుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరవుతున్నారు. సదస్సు హోటల్‌లో కావడంతో ఇబ్బంది ఉండబోదని అధికారులు చెబుతున్నారు. కాగా సోమవారం మధ్యాహ్నం నగరంలో పలుచోట్ల ఒక మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. ఆనందపురం మండలం కణమాంలో 55, మహారాణిపేటలో 31, పెద్దమదీనాబాగ్‌లో 25.75, ఆనందపురంలో 24 మి.మీ. వర్షపాతం నమోదైంది.

అప్పన్న ఆలయ ఉద్యోగుల చేతివాటం

» హుండీ ఆదాయం లెక్కిస్తున్న క్రమంలో చోరీ

» సీసీ టీవీ కెమెరాలో గుర్తించిన ఈఓ

» అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు, పర్మనెంట్ ఉద్యోగి సస్పెన్షన్

» కేసు నమోదుచేసిన గోపాలపట్నం పోలీసులు

సింహాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సమయంలో ఉద్యోగులు చేతివాటం చూపించారు. ఇద్దరు ఉద్యోగులు రూ.500 నోట్లను తెల్లకాగితంలో చుట్టి బ్యాగులో దాచడం సీసీ టీవీ కెమెరాలో రికార్డు కావడంతో ఈవో వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపిన వివరాల ప్రకారం...సింహగిరిపై పరకామణి కేంద్రంలో సోమవారం ఈవో ఆధ్వర్యంలో హుండీలను తెరిచి ఆదాయం లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. దేవస్థానం ఉద్యోగులు, స్వచ్ఛంద ... మిగతా 6వ పేజీలో



ఆదాయం లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ త్రినాథరావు

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.06 కోట్లు -6లో

ఎంవీవీ/ఎంకే పార్క్‌లో ప్రభుత్వ భూమి

» 25.5 సెంట్లు ఉన్నట్టు రెవెన్యూ నిర్ధారణ

» నిర్మాణదారులకు నోటీస్



కూర్మన్నపాలెంలోని ఎంవీవీ, ఎంకే పార్క్

విశాఖపట్నం/గాజువాక, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెంలో ఎంవీవీ/ఎంకే బిల్డర్స్ నిర్మించిన బహుళ అంతస్థుల సముదాయం (ఎంవీవీ,ఎంకే పార్క్)లో 25.5 సెంట్ల ప్రభుత్వ భూమి ఉన్నట్టు రెవెన్యూ శాఖ తేల్చింది. ఆ 25.5 సెంట్లలో గల నిర్మాణాలను తొలగించాలని ఎంవీవీ/ఎంకే హౌసింగ్ పార్ట్‌నర్‌షిప్ సంస్థకు గత నెల 28వ తేదీన గాజువాక తహశీల్దారు నోటీసులు జారీచేశారు. సర్వే నంబర్ 55/3లో గల 2.68 ఎకరాల్లో రహదారి ఉండగా, అందులో 25.5 సెంట్లు ఎంవీవీ, ఎంకే బిల్డర్స్ ఆక్రమించారని తాజా నోటీసులో పేర్కొన్నారు. రహదారిలో 25.5 సెంట్లు ఆక్రమించుకుని ప్రహరీ గోడ, ఇంకా పార్కు, స్విమ్మింగ్‌పూల్ నిర్మించారు. నోటీస్ గడువు ముగిసిన తరువాత అపార్టుమెంట్ ప్రహరీ గోడ కూల్చి 25.5 సెంట్లు స్వాధీనం చేసుకుంటామని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఈ భారీ హౌసింగ్ ప్రాజెక్టు చేపట్టారు. అధికారంలో ... మిగతా 6వ పేజీలో

సింహాద్రినాథునికి తులసీ దళార్చన

సింహాచలం,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సహస్ర తులసీ దళార్చన సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.



స్వామివారికి తులసీ దళార్చన చేస్తున్న అర్చకుడు

ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం నృసింహ సహస్ర నామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన జరిపారు. తరువాత అదే వేదికపై స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహించారు. ఈఓ వేంద్ర త్రినాథరావు దంపతులు పాల్గొని, తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి వస్త్రాలు సమర్పించారు.

పంటల వివరాలు నమోదు తప్పనిసరి

భీమునిపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భీమిలి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న రైతులంతా తక్షణమే ఈ క్రాప్ సర్వేలో వివరాలు నమోదు చేయించుకోవాలని భీమిలి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు బి. విజయ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లో వరి సాధారణ విస్తీర్ణం 10,388 ఎకరాలు కాగా గత నెలాఖరు నాటికి 8,230 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఆగస్టులో కురిసిన వర్షాలకు ఆనందపురం మండలంలో వరి సాధారణ విస్తర్ణం 1529 ఎకరాలకు 771 ఎకరాలు, భీమిలిలో 1283 ఎకరాలకు 750 ఎకరాలు, పద్మనాభంలో 7576 ఎకరాలకు 6709 ఎకరాల్లో ఉభాలు జరిగాయన్నారు. ఖరీఫ్ సీజన్ ఈనెలాఖరుతో పూర్తి కానుండడంతో రైతులు తాము సాగు చేస్తున్న వరి, ఇతర పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. దీనివల్ల పంటకు ఎటువంటి నష్టం వచ్చినా బీమా వస్తుందన్నారు. అలాగే బ్యాంకు రుణాలు పొందడానికి, ప్రభుత్వం నుంచి ఎరువులు, పురుగు మందులు పొందడానికి అవకాశం కలుగుతుందని చెప్పారు. కాగా సోమవారం ఆయన తాటితూరు, నగరపాలెం, దాకమర్రి గ్రామాల్లో పర్యటించారు. రైతులను కలిసి పంట వివరాల నమోదు గురించి అవగాహన కల్పించారు.



తాటితూరులో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న విజయప్రసాద్

డిగ్రీ కళాశాలకు 15 బెంచీలు వితరణ

తగరపువలస, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వేములవలస ఉషాదేవి ఛారిటబుల్ ట్రస్టు 15 డెస్కు బెంచీలను వితరణగా అందించింది. వీటిని ఆ సంస్థ ప్రతినిధి డా. ఎం. రామజోగినాయుడు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలకు సొంత భవనాలు లేకపోవడంతో ప్రస్తుతం అద్దె భవనంలో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. దాతల సహాయంతో మౌలిక సదుపాయాలు సమకూరుస్తున్నామని చెప్పారు.

గణేశ్ లడ్డూ రూ. 66 వేలుకు వేలం



లడ్డూతో మాధవీ గణేశ్

మధురవాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తారక రామానగర్‌లో సాయిశక్తి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూను నిర్వాహకులు వేలం వేయగా మాధవీ గణేశ్ రూ. 66 వేలకు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మీసత్యనారాయణ, సయ్యద్ ఆదిల్, సుజాతా రంగారావు, నరసింగ్ పట్నాయక్, ఆదినారాయణ, ఎర్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో చిరుజల్లులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాలైన సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, రుషికొండలో సోమవారం సాయంత్రం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి. ఉదయం నుంచి ఎండ ఉండగా సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. తీరంలో అలలు ఎగసి పడుతుండడంతో రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లకు పర్యాటకుల తాకిడి తగ్గింది.

ఘనంగా త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం

కొమ్మాది, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది జంక్షన్‌లో ఉన్న బంగారమ్మ, ఎర్నమ్మ, దండుమారమ్మ (త్రిశక్తి దేవాలయం) ఆలయం వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ అమ్మవార్లు 14 గ్రామాల ప్రజలకు ఆరాధ్య దేవతలు. ఈమేరకు వేకువజామున అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం నవదుర్గా హోమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు పిల్లా పాపారావు, అప్పలరాజు, పిల్లా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

92.16 శాతం పింఛన్లు పంపిణీ

విశాఖపట్నం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ వర్గాలకు చెందిన 1,60, 445 మందిలో 1,47,869 మందికి (92.16 శాతం) సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామీణ మండలాల్లో 26,636 మందికిగాను 24,815మంది (93.16 శాతం)కి, జీవీఎంసీ పరిధిలో 1,33,793 మందికిగాను 1,23,054 మంది (91.96 శాతం)కి పింఛన్లు అందజేశారు. అదేవిధంగా గత నెలలో సుమారు 1,558 మంది దివ్యాంగులకు పెన్షన్లు నిలిపివేయగా, అందులో 1,200 మందికి ఈ నెల తిరిగి పంపిణీ చేశారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు, అధికారులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

అప్పన్న ఆలయ ఉద్యోగుల చేతివాటం

... 5వ పేజీ తరువాయి

సేవా సంస్థల ప్రతినిధులు ఆదాయం లెక్కింపు ప్రారంభించారు. మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో దేవస్థానం ట్రాన్స్‌పోర్టు విభాగంలో క్లీనర్‌గా పనిచేస్తున్న కె.రమణ కొన్ని రూ.500 నోట్లను తెల్లకాగితాల్లో చుట్టి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పంచదార్ల సురేష్‌కు అందజేశాడు. అతడు దానిని తన వద్ద ఉన్న హుండీ తాళాలు భద్రపరిచే బ్యాగ్‌లో దాచేశాడు. ఈ మొత్తం వ్యవహారం సీసీ టీవీ కెమెరాలో రికార్డయింది. ఈవో సీసీ టీవీ ఫుటేజిని పరిశీలిస్తుండగా చోరీ వ్యవహారం బయటపడింది. దీంతో ఆ ఇద్దరు ఉద్యోగులను తనిఖీ చేయాలని ఏఈఓ రమణమూర్తిని ఆదేశించారు.తనిఖీల్లో సురేష్ వద్ద ఉన్న బ్యాగ్‌లో 111 రూ.500 నోట్లు బయటపడ్డాయి. విచారించగా రమణ తనకు ఇచ్చినట్టు అంగీకరించాడు. ఈ ఘటనలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సురేష్‌ను విధుల నుంచి తప్పించడంతో పాటు పర్మినెంట్ ఉద్యోగి కె.రమణను ఈవో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. అనంతరం వారిపై గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ తేజేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- ఏడో వార్డులో కాలువలు, రోడ్ల పనులకు శంకుస్థాపన

మధురవాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.సోమవారం ఆయన ఏడో వార్డు మిథిలాపురి వుడాకాలనీలో రూ.1.11 కోట్లతో చేపట్టనున్న రహదారులు, కాలువల పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్పొరేటర్ మంగమ్మ అభ్యర్థన మేరకు పాత పోతినమల్లయ్యపాలెంలో సీసీ రోడ్డు, మిథిలాపురి వుడాకాలనీ, ఎన్‌జీ కాలనీ, ఆర్టీసీ డిపో సమీపంలో బీటీ రోడ్లు, మొగధారమ్మ కాలనీలో సీసీ కాలువలు నిర్మించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిల్లా వెంకటరావు, నాయకులు పోతిన నాయుడు, మధురవాడ పీఏసీఎస్ చైర్మన్ పోతిన ప్రసాద్, నరసింహనాయుడు 2, 8 వార్డుల కార్పొరేటర్లు వెంకటకుమారి, లొడగల అప్పారావు, దుర్గారావు,శివాజీ, సూర్యప్రకాశరావు, అచ్చుతరావు, తదితరులు పాల్గొన్నారు.



పిలకవానిపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పిలకవానిపాలెంలో పింఛన్లు పంపిణీ

కూటమి ప్రభుత్వంలో ఏ సంక్షేమ పథకం ఆగదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన ఏడో వార్డు పిలకవానిపాలెంలో కార్పొరేటర్ పిల్లా మంగమ్మతో కలిసి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు ఎదురైనా తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిల్లా వెంకటరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే

జీవీఎంసీ ఏడో వార్డు చంద్రంపాలెంలో ఏర్పాటు చేసిన 41 అడుగుల మట్టి గణేశ్ ప్రతిమను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.



స్వామివారికి నివేదించిన 1200 లడ్డూలు

లంబోదరుడికి లడ్డూల నివేదన

కొమ్మాది, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అన్నంరాజునగర్ అష్టలక్ష్మీ దేవాలయం ఆవరణలోని మంగళగౌరి సమేత వైశాఖేశ్వర స్వామి ఆవరణలో జరుగుతున్న బాల గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి సోమవారం లడ్డూలు నివేదించారు. తొలుత ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ చక్రధర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం 1200 లడ్డూలు నివేదించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు, తదిత రులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు ఐదు వినతులు

భీమునిపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహిం చిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ఐదు వినతులు అందాయి. జడ్సీ అయ్యప్పనాయుడు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఫిర్యాదులు స్వీకరించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి ఒకటి, ఇంజనీరింగ్ విభాగానికి నాలుగు వినతులు అందాయని అధికారులు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ నిర్మాత కొర్రపాటి సాయి

సింహాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామిని ప్రముఖ సినీ నిర్మాత కొర్రపాటి సాయి సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న నిర్మాత గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన పీఆర్ఓ కార్యాలయంలో నిత్యాన్న ప్రసాద పథకానికి బియ్యం కొనుగోలు చేయాలని కోరుతూ రూ. 63 వేలు విరాళంగా అందజేశారు.



కప్ప స్తంభం వద్ద సాయి

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 3 లక్షల విరాళం

సింహాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి ఎండాడ ప్రాంతానికి చెందిన చింతల కుటుంబ సభ్యులు రూ. 3 లక్షల విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని చెక్ రూపంలో దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావుకు సోమవారం వారు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రాలతో సత్కరించి వేదాశీర్వచనాలను, ప్రసాదాలను అందజేశారు.



ఈఓ త్రినాథరావుకు చెక్ అందజేస్తున్న దాత

ఆగమ పాఠశాల విద్యార్థుల సహస్ర లింగార్చన



సహస్ర లింగార్చన చేస్తున్న విద్యార్థులు

సింహాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆగమ పాఠశాలలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేద విద్యార్థులు సోమవారం సహస్ర లింగార్చన, అఖండ వేదపారాయణలు చేశారు.ప్రభాతారాధనలు తరువాత షోడశోపచారాలు సమర్పించిన వెంటనే వేద పండితుడు రాజేశ్ అఖండ శుక్ల యజుర్వేద పారాయణం సూర్యోదయం నుంచి సాయత్రం వరకు చేపట్టారు. అనంతరం శైవాగమ పండితుడు సుబ్రహ్మణ్య శివాచార్యులు పర్యవేక్షణలో మట్టితో తయారు చేసిన సహస్ర (వేయి)లింగాలకు విద్యార్థులు పంచామృతాలతో అభిషేకాలు జరిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.06 కోట్లు

సింహాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామికి హుండీల ద్వారా గత 28 రోజుల్లో రూ.2.06 కోట్ల ఆదాయం సమకూరింది. ఈఓ వేంద్ర త్రినాథరావు ఆధ్వర్యంలో దేవదాయ శాఖ ప్రత్యేక అధికారులు బండారు ప్రసాద్, ఎంఎస్ఎన్ మూర్తి పర్యవేక్షణలో సోమవారం ఆలయ హుండీలను తెరిచి, పరకామణిలో లెక్కించారు. ఇందులో రూ.2,06,29,844 నగదు, 174 గ్రాముల స్వర్ణ, 10.335 కిలోల రజిత ఆభరణాలు లభించాయని ఈఓ ప్రకటించారు. వీటితో పాటు 1,306 యూఎస్ డాలర్లు, 100 ఒమన్ కరెన్సీ, కెనడా, సింగపూర్, యూఏఈ, సైదీ అరేబియా, ఖతార్, నేపాల్, మలేషియా, కువైట్, ఇంగ్లాండ్, తదితర దేశాల కరెన్సీ కొంత లభించింది. లెక్కింపు కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ సింగం రాధ, వివిధ విభాగాల సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షణాధికారులు, ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్, శ్రీహరి సేవా సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు‘స్వరూపం’!

- డ్రాపింగ్ పాయింట్ లొకేషన్ పంపిన స్వరూపరాజు
- ఎండీఎంఏ కేసులో కొత్త పేరు
- బయటకు వస్తున్న మత్తు లింక్‌లు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

వైజాగ్ ప్రేమికుల డ్రగ్ కేసులో ప్రధాన నిందితుడు పోలీసులను తప్పుదారి పట్టించాడా?, వాంగ్మూలంలో వాస్తవాలు చెప్పకుండా గోప్యంగా ఉంచాడా? అంటే అవుననే అంటున్నాయి విశ్వసనీయవర్గాలు. కొద్దిరోజుల క్రితం వైజాగ్‌కు చెందిన అర్జా శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్ ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్స్‌తో ఈగల్ బృందానికి చిక్కిన విషయం తెలిసిందే. ఈ కేసును తవ్వేకొద్దీ కొత్త కోణాలు, లింక్‌లు బయటకు వస్తున్నాయి. వైజాగ్‌కు చెందిన లోహిత్ యాదవ్ డ్రాపింగ్ పాయింట్ లొకేషన్‌ను వాట్సాప్‌లో పంపాడని, అక్కడి నుంచి తాను డ్రగ్‌ను తీసుకున్నానని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. లోహిత్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత శ్రీవాత్సవ్ వాస్తవం చెప్పలేదని తేలింది. లోహిత్‌ను పోలీసులు విచారించగా అసలు విషయంతో పాటు కొత్తపేరు వెలుగులోకి వచ్చింది. శ్రీవాత్సవ్, హవీల నుంచి ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీన్ని తానే తెప్పించుకున్నట్టు లోహిత్ యాదవ్ వెల్లడించాడు. దీనికి సంబంధించి రూ.13 వేలను పేమెంట్ యాప్ ద్వారా పంపించాడు. దీంతో శ్రీవాత్సవ్, హవీల వద్ద ఉన్న ఎల్ఎస్‌డీ అతడిదేనని తేలిపోయింది. శ్రీవాత్సవ్‌తో లింక్‌లు ఉన్న లోహిత్ యాదవ్‌ను మాచవరం పోలీసులు ఒకటో ఏసీఎంఎం కోర్టులో సోమవారం హాజరుపరిచారు. అతడికి పోలీసులు 12వ తేదీ వరకు రిమాండ్ విధించింది.

ఇదీ లోహిత్ చరిత్ర

విశాఖపట్నం గొల్లపాలెం ప్రాంతానికి చెందిన జోగా లోహిత్ యాదవ్ ఖాళీగా ఉంటున్నాడు. అతడి తండ్రి విశాఖ మహానగర పాలక సంస్థలో సీనియర్ అసిస్టెంట్. లోహిత్ ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో డ్రగ్స్‌కు అలవాటుపడ్డాడు. బీవీకే కళాశాలలో డిగ్రీలో చేరిన లోహిత్ కొద్దిరోజుల క్రితమే విద్యను మధ్యలో ఆపేశాడు. అక్కడే స్నేహితుల ద్వారా ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్స్‌ను అలవాటు చేసుకున్నాడు. కళాశాల విద్యను ఆపేసిన లోహిత్ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు.ఆక్రమంలోనే శ్రీవాత్సవ్, స్వరూపరాజుతో పరిచయం ఏర్పడింది. డ్రగ్స్ విక్రయించే వారితో స్వరూపరాజుకు విస్తృత పరిచయాలు ఉన్నాయి.

ఎవరీ స్వరూపరాజు

లోహిత్‌యాదవ్‌ను విచారించగా వైజాగ్‌కు చెందిన స్వరూపరాజు పేరు వెలుగులోకి వచ్చింది. అతడిని పోలీసులు ఏ6 నిందితుడిగా ఎఫ్ఆర్‌లో చేర్చబోతున్నారు. బెంగళూరులోని సింగసంద్ర మెట్రో రైల్వేస్టేషన్ వద్ద ఉన్న డ్రాపింగ్ పాయింట్‌ను శ్రీవాత్సవ్‌కు స్వరూపరాజు వాట్సాప్ ద్వారా పంపాడు. ఇప్పుడు ఈ స్వరూపరాజు ఎవరన్న దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. లోహిత్ యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న విషయం తెలియడంతో స్వరూపరాజు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఐదుగురు నిందితులు ఉన్నారు. నిందితులు ఒక్కొక్కరు దొరికే కొద్దీ ఈ లింక్‌ల సంఖ్య మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నారు.

మరుగుదొడ్ల అవసరం తీర్చలేరా?

కృష్ణ కళాశాల ప్రిన్సిపాల్ తీరుపై విద్యార్థి సంఘాల ఆగ్రహం



ప్రిన్సిపాల్ విజయబాబుతో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఏపీ మహిళా సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కృష్ణ కళాశాలను సందర్శించిన ఆయా సంఘాల నాయకులు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు కళాశాలలో మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నామని తెలపడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబును కలిసి విద్యార్థుల సమస్యలు వివరించారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు నిర్మించి అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.రాంబాబు మాట్లాడుతూ సుమారు 2 వేల మంది విద్యార్థులు చదువుతున్న కళాశాలలో వారికి సరిపడా మరుగుదొడ్లు లేకపోయినా ప్రిన్సిపాల్ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇతర కళాశాలల సామగ్రి మరుగుదొడ్ల వద్ద పెట్టడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు యు.నాగరాజు, వనజాక్షి, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలి

... 5వ పేజీ తరువాయి

వ్యక్తిగత కారణాలు చెప్పి బదిలీలు నిలపాలని కోరుతున్నారన్నారు. ఆ తరహా సిఫార్సులు తాను చేయబోనన్నారు. వైద్యులు తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ వ్యాధిని నిర్మూలించేందుకు నడుంబిగించిందని మంత్రి సత్యకుమార్ అన్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు రాకుండా జాగ్రత్తపడడంపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. క్యాన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తించేందుకు సర్వే చేపడుతున్నామని, కొందరు మహిళలు ముందుకురాకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సర్వే కోసం వేలాది మంది వైద్య సిబ్బందిని వినియోగిస్తున్నట్టు వెల్లడించారు. చికిత్స కంటే ముందుగా గుర్తించడమే కీలకమన్న విధానంతో ముందుకు వెళుతున్నామన్నారు. క్యాన్సర్ వల్ల తాను కుటుంబంలో ముగ్గురిని కోల్పోయానని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. అమ్మ, సోదరుడు, అక్క క్యాన్సర్‌తో మరణించినట్టు తెలిపారు. ఆ ఘటనలు తనను ఎంతగానో కలచివేశాయని, అందుకే క్యాన్సర్ మహమ్మారిపై ప్రజాప్రతినిధిగా పోరాటం చేస్తున్నట్టు వెల్లడించారు. ఈరంగంలో నిష్ణాతులను తయారు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు వెళుతున్నామన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అత్యాధునిక పరికరాలు అందించడం గొప్ప విషయమన్నారు. మరోఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కేజీహెచ్ అంటే తనకు ఎంతో ఇష్టమని, రెండుసార్లు గుండెపోటు వస్తే ప్రాణాలు నిలిపిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి, ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య, అంకాలజీ విభాగం వైద్యాధికారులు డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ శిల్ప, డాక్టర్ పాండురంగకుమారి, డాక్టర్ చంద్రశేఖరం నాయుడు, డాక్టర్ గిరినాథ్‌తోపాటు అధిక సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

ఎంవీవీ/ఎంకే పార్క్‌లో ప్రభుత్వ భూమి

... 5వ పేజీ తరువాయి

ఉండడంతో అనేక ఉల్లంఘనలకు పాల్పడినా అధికారులు పట్టించుకోలేదు. తాజాగా రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేసినందున, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అపార్టుమెంట్ అనుమతులు రద్దుకు షోకాజ్ ఇచ్చేందుకు అవకాశం ఉంది. కానీ రాష్ట్ర టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారుల ఒత్తిడితో తమకేమి పట్టనట్టుగా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారు.

తెలియక కొన్నాం..

కూర్మన్నపాలెంలో ఎంవీవీ/ఎంకే అపార్టుమెంటులో ఫ్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులను కలిసి గోడు చెప్పుకున్నారు. ఆ స్థలంలో ప్రభుత్వ భూమి ఉందని తమకు తెలియదని, తామంతా మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారమని, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కౌన్సిల్ తీర్మానానికి తిలోదకాలు!

... 5వ పేజీ తరువాయి

ఆరోపించారు. జీవీఎంసీలో కూడా స్మార్ట్ సిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని కింద చేపట్టిన పనులతోపాటు కార్యాలయాన్ని జీవీఎంసీకి అప్పగించాలని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. దీంతో మేయర్ పీలా శ్రీనివాసరావు ఇకపై విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌కు పనులు అప్పగించడానికి వీల్లేదని, ఇప్పటివరకు ఉన్న ప్రాజెక్టులను, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని తీర్మానం చేస్తూ, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆ విషయాన్ని జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోకుండా గాజువాకలో ఏపీఐఐసీ కేటాయించిన స్థలంలో రూ.30 కోట్లతో భవనాలు నిర్మించేందుకు రెండు రోజుల కిందట టెండర్లు పిలవడం ఆశ్చర్యానికి గురిచేసినట్టయింది. నిబంధనల ప్రకారం కౌన్సిల్ ఆమోదం లేకుండా టెండర్‌లు పిలవకూడదనే నిబంధన ఉన్నప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు ఎందుకు అత్యుత్సాహం చూపించారనే దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగం ఇక్కడ... విధులు అక్కడ!

... 5వ పేజీ తరువాయి

చూడని డీఈ రామరాజును సింహాచలం ఎందుకు పంపుతున్నారనేదే ప్రధాన ప్రశ్న.

చెప్పే వెళుతున్నారు

శోభారాణి, ఈఓ, కనకమహాలక్ష్మి దేవస్థానం

డీఈ రామరాజు...కనకమహాలక్ష్మి దేవస్థానంలో పనిచేయకుండా సింహాచలం వెళ్లి పనిచేయడంపై ఈఓ శోభారాణిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, తనకు చెప్పే అక్కడకు వెళుతున్నారని సమాధానమిచ్చారు. అయితే దీనిపై ఎటువంటి రాతపూర్వకమైన ఉత్తర్వులు లేవని స్పష్టంచేశారు. ఇంజనీరింగ్ పనులు ఉన్నాయంటే అనుమతించామని చెప్పారు.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

... 5వ పేజీ తరువాయి

దరఖాస్తులో ఇచ్చిన ఆప్షన్ మేరకు ఒక పోస్టును ఎంపిక చేసుకోవాలి. తొలి విడత సర్టిఫికెట్ల పరిశీలనలో అటువంటి అభ్యర్థులు ఒక పోస్టు ఎంపిక చేసుకున్న తరువాత మిగిలిన పోస్టుల కోసం అభ్యర్థుల ఎంపికకు తాజాగా సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నారు. కాగా మంగళవారం ఉక్కునగరంలోని విమల విద్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లుచేశామని డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

పింఛన్ అందలేదని వృద్ధురాలి ఆవేదన

ఆరిలోవ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తనకు ఈనెల పింఛన్ అందలేదని ఆరిలోవ 13వ వార్డులోని పసుపులేటి అప్పల కొండ (78) ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తన భర్త జూన్‌లో మృతి చెందడంతో మరణ ధ్రువీకరణ పత్రాన్ని సచివాలయానికి అందజేశానని పేర్కొంది. భర్త మృతి చెందిన వెంటనే భార్యకు పింఛన్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇంతవరకు రాలేదని ఆమె తెలిపారు. వయోభారంతో పని చేయలేకపోతున్నానని, పింఛన్ అందితే ఆసరాగా ఉంటుందని పేర్కొంది. ఒకటో తేదీన కొత్త పింఛన్ వస్తుందని ఆశపడితే నిరాశ ఎదురైందని, అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

మెట్ల మార్గం పునరుద్ధరణ పనులు ప్రారంభం



పనులు జరుగుతున్న దృశ్యం

సింహాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఏప్రిల్ 30 చందనోత్సవం రోజున జరిగిన దుర్ఘటనలో దెబ్బతిన్న గోడ, మెట్ల పునర్నిర్మాణ పనులకు అధికారులు సోమవారం శ్రీకారం చుట్టారు. చందనయాత్ర వేకువజామున గోడకూలి ఏడుగురు భక్తులు మృత్యువాత పడడంతో ఆ మార్గాన్ని మూసివేశారు. అక్టోబరు 2న శమీపూజకు సింహాద్రినాథుడ్ని ఇదే మార్గంలో కొండదిగువకు తీసుకువస్తారు. దీంతో గోడ, మెట్లను పునర్నిర్మించాలని వైదికులు దేవదాయశాఖ మంత్రిని కోరారు. దీంతో దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈఓ పర్యాటకశాఖ ఇంజనీరింగ్ అధికారులకు రెండుసార్లు లేఖలు రాసినా ఫలితం లేకపోవడంతో దేవస్థానం నిధులు రూ.18 లక్షలతో మెట్లమార్గం పనులను చేపట్టారు. ఈ మేరకు గోడ అవశేషాలను యంత్రాల సాయంతో తొలగించారు.

ఆక్రమిత స్థలాలు స్వాధీనం చేసుకోవాలని వినతి

ఆనందపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామవరంలో ఇందిరమ్మ కాలనీ ఇళ్లల్లో ఆక్రమణకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈమేరకు సోమవారం వారు కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 2006లో సర్వే నెంబరు 11లో పేదలకు ఇందిరమ్మ కాలనీ పేరిట ఇళ్ల స్థలాలు అందజేశారు. కొందరు స్థానిక నాయకులు ఆరు స్థలాలను ఆక్రమించారు. ప్రస్తుత మార్కెట్ ప్రకారం వాటి విలువ సుమారు రూ. 50 లక్షల ఉంటుందని, ఆ స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరు పేదలకు ఇవ్వాలని వారు కోరారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 30, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 38, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 50, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 66, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 76, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	117
లైవ్ ధర	137
విత్ స్కిన్	244
స్కిన్‌లెస్	254

ఎమ్మెల్యే చొరవతో కదిలిన సర్వే యంత్రాంగం

జేసీ ఆదేశాలతో భానునగర్‌లో నష్ట పరిహార భూముల సర్వే



భానునగర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు భానునగర్‌లో స్థలాలన్నీ తమకు నష్టపరిహారంగా ఇచ్చినవేనని, ప్రభుత్వ స్థలాలు కాదని, వెంటనే తమ ప్రాంతాన్ని 22ఏ నుంచి తొలగించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కలిసి భానునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని జేసీ కె.మయూర్ అశోక్‌తో మాట్లాడి, అనంతరం అసోసియేషన్ సభ్యులను ఆయన వద్దకు పంపారు. ఇది వరకు ప్రభుత్వ ప్రధాన సర్వేయర్ దుర్గాప్రసాద్ తన బృందంతో భానునగర్‌కు వచ్చి నష్ట పరిహార భూములను సర్వే జరిపారని, ఇవి 22-1బిలో ఉన్నాయని, త్వరలోనే నివేదిక సమర్పించి తగిన చర్యలు చేపడతామని సభ్యులకు సర్వేయర్ దుర్గాప్రసాద్ హామీ ఇచ్చారు. ఇకపై సభ్యులు తమ భూములను యథేచ్ఛగా వాడుకునేలా (రుణాలకు, అమ్ముకునేందుకు) చూస్తామని చెప్పారు. ఈ భూములను 22-1బి నుంచి తొలగించే అధికారం జేసీకి లేదని, రెవెన్యూ విభాగానికి సిఫారసు చేయగా అర్బన్ ఎమ్మార్వో కార్యాలయం నుంచి మండల సర్వేయర్ ముద్దుకృష్ణ, వీఆర్వో, ఆర్ఐలు సోమవారం భానునగర్ భూములను సర్వే జరిపారు. ఈ క్రమంలో స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ విన్నపానికి వెనువెంటనే స్పందించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జేసీ మయూర్ అశోక్‌లకు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.తమకు సహకరించిన ఆంధ్రజ్యోతికి కూడా ధన్యవాదాలు తెలియజేశారు. స్థలాల వివరాలను సర్వేయర్‌లకు వివరించిన వారిలో అసోసియేషన్ సభ్యులు వంకా శివశంకర్ లాజరస్, ఒమ్మి అప్పారావు, ఒమ్మి జగ్గారావు, ఎం.హైమా, శంకర్ , కిరణ్, సరస్వతి తదితరులు ఉన్నారు.



మూషిక వాహన గణపతిగా సంపత్ వినాయగర్‌స్వామి

మూషిక వాహన గణపతిగా సంపత్ వినాయగర్

సిరిపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ సంపత్ వినాయగర్ ఆలయంలో సోమవారం మూషిక వాహన గణపతిగా సంపత్ వినాయగర్ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం హోమం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నారాయణ సేవ చేయగా, సాయంత్రం భక్తి సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. నాదస్వర కచేరి, శతావధాని డా.తాత సందీప్‌శర్మ 'కిరాతార్జునీయం'పై ప్రవచనమిచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేశానికి ఆదర్శం సీఎం చంద్రబాబు

- ప్రజల భాగస్వామ్యంతో ప్రజారంజక పాలన
- ఎమ్మెల్యే రామకృష్ణబాబు



ఎంవీపీ కాలనీ,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్ల క్రితం ఇదే రోజున ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, నాలుగు సార్లు సీఎం చంద్రబాబు అనేక పథకాలు, కార్యక్రమాలు అమలుచేస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్నారని తూర్పు శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల వద్దకు పాలన నినాదం దేశంలోనే ఓ సంచలనమని పేర్కొన్నారు. జన్మభూమి ఓ వినూత్న పథకమని, పచ్చదనం..పరిశుభ్రతతో ప్రజల్లో చైతన్యం తెచ్చారని, బాలికా విద్యకు ప్రాధాన్యం, మహిళలకు దీపం పథకం, కులవృత్తులకు గౌరవం లభించేలా బీసీలకు ఆదరణ పథకం, ఎస్సీల రక్షణ కోసం పున్నయ్య కమిషన్ సూచనలు అమలు చేయడం, బీసీలకకు, మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడం, మైనార్టీలకు సంక్షేమం, భద్రత, ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశందేనని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు కారణమైన వ్యక్తి చంద్రబాబు అని పేర్కొన్నారు. విద్యుత్తు రంగంలో సంస్కరణలు అమలుచేయడం, ప్రైవేటు రంగంలో తొలి విమానాశ్రయం, టెలికాం సంస్కరణలకు కీలక సూచనలు, పీపీపీ విధానంలో జాతీయ రహదారులకు అంకురార్పణ, గ్రామాల్లో చక్కని రహదారులు, ఐటీకి ప్రాధాన్యతతో హైటెక్ సిటీ నిర్మాణం, భారీ సంఖ్యలో ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుకు కృషి, ప్రతి జిల్లాలో వైద్య కళాశాలల ఏర్పాటు, విజన్ 2020తో కొత్త పాలనకు నాంది పలకడం, 1.80 లక్షల మంది ఉపాధ్యాయుల నియామకం, పర్యాటకాభివృద్ధికి ప్రాధాన్యం, డిజిటల్ గవర్నెన్స్‌తో సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుదేనని తెలిపారు. అన్నా క్యాంటీన్‌ల నిర్వహణ, రైతుల కోసం ఇజ్రాయెల్ సాంకేతికతతో డ్రిప్ ఇరిగేషన్ ప్రవేశపెట్టడం, రైతులకు సబ్సిడీలు, యాంత్రీకరణ, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం, నదుల అనుసంధానం, దళితుల కోసం ఎస్సీ వర్గీకరణ, రియల్ టైం గవర్నెన్స్, అమరావతి రాజధాని నిర్మాణం, పేదరిక నిర్మూలనకు పీ4 వంటి భారీ సంస్కరణలు చేపట్టడం చంద్రబాబుకే సాధ్యమన్నారు.

డీసీసీబీ ఛైర్మన్‌ను కలిసిన పీఏసీఎస్ అధ్యక్షులు



డీసీసీబీ ఛైర్మన్ తాతారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధ్యక్షులు

ఆనందపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆనందపురం, వేములవలస సహకార సంఘాల నూతన అధ్యక్షులు పాండ్రంకి అప్పలరాజు, రౌతు నాగరాజు నగరంలోని డీసీసీబీ కార్యాలయంలో ఛైర్మన్ కోన తాతారావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. మార్టిగేజ్ రుణాలు ద్వారా ఇప్పటివరకు ఎకరాకు రూ. 5 లక్షల అందించేవారని, ఆనందపురంలో మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ. 10 లక్షలు పెంచాలని కోరారు. అలాగే డీసీసీబీ ద్వారా డ్వాక్రా మహిళలకు రుణాలు అందించాలని, వాణిజ్య బ్యాంకుల వలే సులభతరమైన రుణాలు ఇవ్వాలని చెప్పారు. అనంతరం వారు కోన తాతారావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ డీవీఎస్ వర్మ, తర్లువాడ సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, ఆనందపురం, వేములవలస పీఏసీఎస్‌ల సీఈఓలు ఎస్. నారాయణరావు, బి. దశావతారం, తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో 90 శాతం పింఛన్లు పంపిణీ



కృష్ణాకాలనీలో పింఛన్లు అందిస్తున్న జడ్సీ అయ్యప్పనాయుడు

భీమునిపట్నం,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :భీమిలి జోన్‌లో సోమవారం సామాజిక పింఛన్లను 90 శాతం పంపిణీ చేశామని జోన్ వన్ జడ్సీ అయ్యప్పనాయుడు తెలిపారు. ఆయన పట్టణంలోని కృష్ణాకాలనీ సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోన్‌లో మొత్తం 8564 మంది పింఛన్‌దారులు ఉండగా 7785 మందికి పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ పీడీ వీకే దొర, తదితరులు పాల్గొన్నారు.

ఎగువపేటలో బాహుబలి సెట్



ఆకట్టుకుంటున్న బాహుబలి సెట్‌లో వినాయక మండపం

భీమునిపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎగువపేటలో రుద్ర యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన బాహుబలి సెట్ భక్తులను ఆకట్టుకుంటుంది. రుద్ర బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో కారి శ్రీధర్ ఈ సెట్ వేశారు. వినాయక మండపం, స్టేజ్ అలంకరణ, గోపురం నిర్మాణం ఆకట్టుకుంటున్నాయి.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు



వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

పద్మనాభం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. ఆర్వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసిన పల్ల వెంకటేశ్వరరావు పదవీ విరమణ సభలో సోమవారం ఆయన మాట్లాడారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. అనంతరం ఆయన వెంకటేశ్వరావు దంపతులను ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్ఎం వి. శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వి. రఘువర్మ, ఎంపీపీ రాంబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, సర్పంచ్ రమణ, అప్పలనాయుడు, గంగరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు గొప్ప పాలకుడు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాల్లోకి కొత్త తరాన్ని తీసుకువచ్చి నాయకులుగా తీర్చిదిద్దన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందని,తాను కూడా ఆయన తయారు చేసిన నాయకుడినేనని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.ఎంవీపీ కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంస్కరణలతో పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. తిరుపతి సమీపాన చిన్న గ్రామంలో పుట్టిన చంద్రబాబు ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకుండా విద్యార్థి నాయకుడి నుంచి సీఎం స్థాయికి చేరుకున్నారన్నారు. మొత్తం 5,442 రోజులు సీఎంగా బాధ్యతలు నిర్వహించి రికార్డ్ సాధించారన్నారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి శ్రీకారం చుట్టిన చంద్రబాబు మైక్రోసాఫ్ట్‌తో గేమ్ ఛేంజర్‌గా మార్చారన్నారు. అప్పులతో ఉన్న ఏపీని ఏడాదిలోనే అత్యున్నత స్థాయికి తెచ్చారని కొనియాడారు. విశాఖకు టీసీఎస్, అదానీ డేటా సెంటర్, కాగ్నిజెంట్, సత్వా, సిఫీ వంటి అంతర్జాతీయ సంస్థలను తీసుకువస్తున్నారన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైతే విశాఖ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం చంద్రబాబు సీఎంగా ప్రమాణం స్వీకారం చేసి 30 ఏళ్లు అంటూ ప్లకార్డులు ప్రదర్శించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, పీవీ నరసింహం, పిల్లా మంగమ్మ, మొల్లి హేమలత, గంటా నూకరాజు పాల్గొన్నారు.

మహిళా సెజ్‌కు భూమిని గుర్తించండి

మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా ఆర్థిక మండలి ఏర్పాటు చేయడానికి అవసరమైన భూమిని గుర్తించాలని ఏపీఐఐసీ అధికారులను ఎమ్మెల్యే గంటా ఆదేశించారు. సోమవారం ఆయన ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో ఏపీఐఐసీ అధికారులతో సమావేశమయ్యారు. భీమిలి నియోజకవర్గంలో కనీసం 50 ఎకరాలు గుర్తించాలని చెప్పారు.

ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నీకి ముగ్గురు ఎంపిక

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే భారత జట్టుకు నగరానికి చెందిన బీవీఎస్‌కేలింగేశ్వరరావు, కేపీ నాయక్, సీహెచ్.సన్యాసిరావు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నెల 7 నుంచి థాయిలాండ్‌లో జరగనున్న ఈ టోర్నీలో లింగేశ్వరరావు పురుషుల 55 ప్లస్ విభాగంలో డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో... నాయర్ పురుషుల 60 ప్లస్ కేటగిరీలో డబుల్స్ సన్యాసిరావు పురుషుల 55 ప్లస్ విభాగంలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ టోర్నీలో ప్రపంచ వ్యాప్తంగా 56 దేశాల నుంచి సీనియర్ షట్లర్లు పాల్గొంటున్న నేపథ్యంలో నగర క్రీడాకారులు దేశానికి పతకాలు అందించాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

5న న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

ముఖ్యఅతిథిగా హాజరు కానున్న సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్

సబ్బవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవం (8 నుంచి 12 వరకు) ఈ నెల ఐదో తేదీ ఉదయం విశాఖపట్నంలోని హోటల్ నోవాటెల్‌లో జరుగుతుందని ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు తెలిపారు. సోమవారం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారన్నారు. గౌరవ అతిథులుగా సుప్రీం కోర్టు నాయమూర్తులు జస్టిస్ పి.నరసింహ, జస్టిస్ జేకే మహేశ్వరి (డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ చాన్సలర్), ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎస్ఎన్ఎల్‌యూ చాన్సలర్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరవుతారన్నారు. అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్-2, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇతర కొత్త భవనాలను ప్రారంభిస్తారని, జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య విగ్రహాలను ఆవిష్కరిస్తారనిఇ చెప్పారు. మీడియా సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి : మేయర్



మేయర్‌తో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు సత్యనారాయణరాజు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన ఇంజనీరుగా బాధ్యతలు స్వీకరించిన పి.వి.వి.సత్యనారాయణరాజు నగర మేయర్ పీలా శ్రీనివాసరావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీలో పర్యవేక్షక ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న తనకు ప్రభుత్వం జీవీఎంసీ ప్రధాన ఇంజనీరుగా పదోన్నతి కల్పించిందని తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీలో పర్యవేక్షక ఇంజనీరుగా విధులు నిర్వహిస్తూ అదే జీవీఎంసీలో ప్రధాన ఇంజనీరుగా పదోన్నతి పొందడం అభినందనీయమన్నారు. ప్రధాన ఇంజనీరు హోదాలో అభివృద్ధి పనులు, ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని కోరారు. చేపట్టబోతున్న కొత్త ప్రాజెక్టులు, ప్రజలకు కల్పించవలసిన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచిస్తూ ఆయన్ను అభినందించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ విభాగంలో అతిథి అధ్యాపకులను నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీ సబ్జెక్ట్‌లో పీజీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నవంబరు 2న నిర్వహించే మౌఖిక పరీక్షకు హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 81065 43229 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

22వ వార్డు టీడీపీ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న బొట్టా వెంకటరమణ

మద్దిలపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శివాజీపార్క్ రోడ్డు సవేరాఫంక్షన్ హాల్లో సోమవారం టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో 22వ వార్డు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో వార్డు నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోడిబోయిన ఆనంద్, కార్యదర్శిగా మల్లా రవి, యువజన అధ్యక్షుడిగా ఎస్.కె.మదీనా, యూత్ కార్యదర్శిగా గుండాల శంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా గుణలక్ష్మి, కార్యదర్శిగా మండా శ్రీదేవిలను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గానికి వెంకటరమణ అభినందనలు తెలిపి, తెలుగుదేశం పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా పనిచేయాలని సూచించారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి అప్పారావు, వార్డు మాజీ అధ్యక్షుడు దువ్వి స్వామి పాల్గొన్నారు.

12వ వార్డులో...

ఆరిలోవ : జీవీఎంసీ పరిధిలోని 12వ వార్డు తోటగరువులో టీడీపీ సంస్థాగత ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగినట్లు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. వార్డు అధ్యక్షునిగా గాడి సత్యం, ప్రధాన కార్యదర్శిగా పోతిన భరత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షునిగా నూరాల బ్రహ్మం, రెండో ఉపాధ్యక్షుడిగా కె.గోపాల్‌ను ఎన్నుకున్నారు. వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, పోలారావు, ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు.

గణపతి ఆశీస్సులు అందరిపై ఉండాలి

మార్కెటింగ్ శాఖ డి.డి. శ్రీనివాస్

పెదవాల్తేరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గణనాథుని ఆశీస్సులు రైతులందరిపై ఉండాలని మార్కెటింగ్ శాఖ డి.డి. శ్రీనివాస్ అన్నారు. సోమవారం పెదవాల్తేరు రైతుబజార్‌లో గణేశ్ మండపం వద్ద రైతులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్టేట్ అధికారిణి సత్యకళతో కలిసి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా కళాకారుల కోలాటం అందరినీ అలరించింది. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారిణి సత్యకళ, సహాయకులు లోవరాజు, పలు రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు, రైతులు, వినియోగదారులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

వర్కుషాప్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ జీపీ రాజశేఖర్, తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏయూ బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో అక్టోబరు 27, 28వ తేదీల్లో ట్రాన్సేషనల్ మెడిసిన్ ఇన్ క్యాన్సర్ అన్న అంశంపై వర్కుషాప్ జరగనుంది. ఈమేరకు వీసీ రాజశేఖర్ సోమవారం తన కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, వర్కుషాప్ కన్వీనర్ ఆచార్య పి. రాధిక, రాఘవరావు పాల్గొన్నారు. అలాగే ఏయూ సెంటర్ ఫర్ స్టడీస్ ఆఫ్ సోషల్ ఇన్‌క్లూజన్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు సంపాధకత్వంలో రూపొందించిన రెండు పుస్తకాలను కూడా వీసీ ఆవిష్కరించారు. మొదటి పుస్తకంలో 16 పరిశోధనా, రెండో పుస్తకంలో 12 పరిశోధనా పత్రాలు ఉన్నాయి.



సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో శివ బాలగణపతిగా అలంకరణ



అక్కయ్యపాలెంలోని ఆంధ్రజ్యోతి కార్యాలయం సమీపంలో శివగణపతిగా లక్ష్మీగణపతి దర్శనం -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం



మురళీనగర్‌లోని వాకర్స్ క్లబ్‌లో సోమవారం రాత్రి వినాయకుడి వద్ద శివలింగాకారంలో దీపాలు వెలిగించిన మహిళలు -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

దుర్గాగణపతి ఆలయం లడ్డూ రూ.1,11,006లకు వేలం



లడ్డూ వేలం పాడుకున్న సతీశ్‌కుమార్‌తో కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ తదితరులు

సీతంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన 99 కిలోల లడ్డూను సోమవారం వేలం వేశారు. ఈ లడ్డును స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్ ఆర్య వేలంలో రూ.1,11,006 లకు లడ్డును దక్కించుకున్నారు. ఈ సొమ్మును పూజలు, అన్నదాన కార్యక్రమంలో వినియోగిస్తామని ఉత్సవ కమిటీ ఛైర్మన్ సారిపల్లి గోవింద్ తెలిపారు.

సింహాద్రి అప్పన్న హుండీ ఆదాయం రూ.2.06 కోట్లు

సింహాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామికి హుండీల ద్వారా గత 28 రోజుల్లో సుమారు రూ.2.06 కోట్ల ఆదాయం సమకూరింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు ఆధ్వర్యంలో దేవదాయ శాఖ ప్రత్యేక అధికారులు బండారు ప్రసాద్, ఎంఎస్ఎన్ మూర్తి పర్యవేక్షణలో సోమవారం ఆలయ హుండీలను తెరిచి, పరకామణిలో లెక్కించారు. ఇందులో రూ.2,06,29,844 నగదు, 174 గ్రాముల స్వర్ణ, 10.335 కిలోల రజిత ఆభరణాలు లభించాయని ఈఓ ప్రకటించారు. వీటితో పాటు 1,306 యూఎస్ డాలర్లు, 100 ఒమన్ కరెన్సీ, కెనడా, సింగపూర్, యూఏఈ, సైదీ అరేబియా, ఖతార్, నేపాల్, మలేషియా, కువైట్, ఇంగ్లాండ్, తదితర దేశాల కరెన్సీ కొంత లభించింది. లెక్కింపు కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ సింగం రాధ, వివిధ విభాగాల సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షణాధికారులు, ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్, శ్రీహరి సేవా సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లి సామాజిక పింఛన్ల పంపిణీ



పింఛన్ సొమ్ము అందచేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం పరిధి 14వ వార్డు సీతమ్మధారని పలు ప్రాంతాల్లో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సోమవారం పలువురు ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందచేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

25వ వార్డులో..

సీతంపేట: ఏపీడీవో రాము పర్యవేక్షణలో 25వ వార్డులో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ సోమవారం దుర్గాగణపతి ఆలయం వద్ద ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, జనసేన వార్డు అధ్యక్షుడు ప్రకాష్, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఇసరపు వాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గండి బాబ్జీ జన్మదిన వేడుకలు



పండ్లు పంపిణీ చేస్తున్న గోపాల్‌రెడ్డి

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ జన్మదిన వేడుకలు మీడియా కో ఆర్డినేటర్ కె.గోపాలరెడ్డి ఆధ్వర్యంలో గ్రేటర్ 42వ వార్డులో సోమవారం ఘనంగా జరిగాయి. జగన్నాథపురంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వృద్ధులతో కేకు కోయించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి దువ్వి కాశీప్రసాద్, లక్ష్మీ గణేష్ ఆలయం ట్రస్టీ రమణమ్మ పాల్గొన్నారు.

భవన నిర్మాణాల్లో సెట్ బ్యాక్‌లు తప్పనిసరి

» ద్వారకానగర్‌లో భవన నిర్మాణాన్ని తనిఖీ చేసిన జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గర్గ్ ఆదేశం



భవన నిర్మాణ ప్లాన్ పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గర్గ్

సీతంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో భవన నిర్మాణదారులు తప్పనిసరిగా సెట్ బ్యాక్స్ నిబంధనలు పాటించకపోతే అనుమతులు ఉపసంహరిస్తామని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గర్గ్ హెచ్చరించారు. సోమవారం ఆయన జీవీఎంసీ సీటీ ప్లానర్ ధనుంజయతో కలిసి మూడో జోన్ పరిధి 27వ వార్డులోని ద్వారకానగర్ మొదటి లైన్‌లో భవన నిర్మాణ అనుమతులు కోరిన ప్రతిపాదిత వాణిజ్యసముదాయాన్ని పరిశీలించారు. ముందుగా అనుమతులు కోరుతూ ప్రతిపాదించిన జి ప్లస్ ఫోర్ వాణిజ్య సముదాయం ప్లాన్‌ను కమిషనర్ పరిశీలించారు. వాణిజ్య సముదాయంలో సెట్ బ్యాక్‌లు విడిచిపెట్టిన స్థలాలకు, రోడ్డు వెడల్పునకు కొలతలు నిర్వహించి, మార్ట్‌గేజ్ కోసం విడిచిపెట్టిన ఏరియాను కూడా పరిశీలించారు. ప్లాన్‌కు సంబంధించిన దస్తావేజులను క్షుణ్ణంగా పరిశీలించి వాణిజ్య సముదాయం నిర్మాణంలో ఎటువంటి లోపాలు లేకుండా ప్లాన్ ప్రకారమే నిర్మించాలన్నారు. అదేవిధంగా నిర్మాణంలో సెట్ బ్యాక్‌లు తప్పనిసరిగా పాటించి, గాలి, వెలుతురు వచ్చేలా అంతర్గత నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని సిటి ప్లానర్ ధనుంజయ, భవన నిర్మాణ యజమానులను కమిషనర్ ఆదేశించారు. నిర్మాణం జరుగుతున్నప్పుడు పూర్తిగా గ్రీన్ మ్యాట్ కప్పి ఉంచాలని, భవన నిర్మాణ సామగ్రిని రోడ్లపై వేయకుండా లోపల ఉంచుకోవాలన్నారు. నగరంలో భవనాలు, వాణిజ్య సముదాయాలు నిర్మించేటప్పుడు సంబంధిత నిర్మాణదారులు సెట్ బ్యాక్‌లు తప్పనిసరిగా పాటించేలా చర్యలు చేపట్టాలని సిటీ ప్లానర్‌కు, జోనల్ కమిషనర్ శివప్రసాద్‌కు కమిషనర్ ఆదేశించారు. డీసీపీ మధుసూదనరావు పాల్గొన్నారు.

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జనసేన కార్యకర్తలు

అల్లిపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుని 34వ వార్డు జనసేన అధ్యక్షుడు నీలం రాజు ఆధ్వర్యంలో అచ్చియ్యమ్మపేట వద్ద సోమవారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ విచ్చేసి జనసైనికుల మధ్య కేకు కట్ చేశారు. అనంతరం చిరు వ్యాపారులకు బడ్డీలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

92.16 శాతం పింఛన్లు పంపిణీ

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ వర్గాలకు చెందిన 1,60,445 మందిలో 1,47,869 మందికి (92.16 శాతం) సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామీణ మండలాల్లో 26,636 మందికిగాను 24,815మంది (93.16 శాతం)కి, జీవీఎంసీ పరిధిలో 1,33,793 మందికిగాను 1,23,054 మంది (91.96 శాతం)కి పింఛన్లు అందజేశారు. అదేవిధంగా గత నెలలో సుమారు 1,558 మంది దివ్యాంగులకు పెన్షన్లు నిలిపివేయగా, అందులో 1,200 మందికి ఈ నెల తిరిగి పంపిణీ చేశారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు, అధికారులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పాల్గొన్న కార్పొరేటర్, స్థానిక నాయకులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు లక్ష్మీనారాయణపురం-2లో రూ.88.05 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, ఈఈ పద్మావతి, డీఈ భరణి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



గుడ్డ సంచులు చూపిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మన పరిసరాలు మనమే పరిశుభ్రంగా ఉంచాలని యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ సంస్థ కమ్యూనిటీ ట్రైనర్ ఐ.కృష్ణకుమారి పిలుపునిచ్చారు. రైల్వేన్యూకాలనీలోని కమలా నెహ్రూ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో అమలవుతున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని శాంతికుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించాలన్నారు. మన పాఠశాలను మనమే ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, కోరమండల్ ఫెర్టిలైజర్స్, గ్రీన్ క్లైమేట్ బృందం నేతృత్వంలో గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు ఎస్.భారతి, డి.సత్య పాల్గొన్నారు.

చిరస్మరణీయులు 'ఇంద్రగంటి'

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మశ్రీ ఇంద్రగంటి రామచంద్రమూర్తి చిరస్మరణీయులని ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఛైర్మన్ ఎ.వెంకటరావు శ్లాఘించారు. సోమవారం డాబాగార్డెన్స్ లలితాకాలనీ ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి కార్యాలయంలో రామచంద్రమూర్తి ప్రథమ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత రామచంద్రమూర్తి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. కొద్దిసేపు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఇంద్రగంటి ఆధ్యాత్మిక సేవలను కొనియాడారు. పి.జగన్‌మోహనరావు, సంయుక్త కార్యదర్శి వి.మధుసూదనరావు, ఎం.నాగేశ్వరరావు, లక్ష్మీ, గాయత్రీ, గీత, శిష్యులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

'రెండోసారి ఫిర్యాదులు రాకుండా చూసుకోండి'



సమస్య వింటున్న జెడ్సీ రాము

జ్ఞానాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి గతంలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు, సచివాలయ కార్యదర్శులు సక్రమంగా స్పందించడంలేదని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము అసంతృప్తి వ్యక్తంచేశారు. సోమవారం ప్రజల నుంచి మూడు వినతులు అందుకున్న ఆయన అధికారులతో సమీక్షిస్తూ ఫిర్యాదులు రెండుసారి రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. తాజాగా రెవెన్యూ విభాగానికి 2 ,పట్టణ ప్రణాళికా విభాగానికి ఒక అర్జీ అందాయి. ఈఈ పద్మావతి, తారాప్రసన్న, రెవెన్యూ అధికారులు బాబురావు, రాజ్యలక్ష్మి, టీపీఓ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలు గీతాల ఆడియో ఆవిష్కరణ

మహారాణిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలు విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, ఏయూ జర్నలిజం మాజీ విభాగాధిపతి బాబివర్ధన్‌లు తెలిపారు. మహాసభలు విజయవంతం చేయటానికి సినీ గేయ రచయిత సుద్దాల అశోకతేజ, నేపథ్య గాయకుడు రాంకీ ఆలపించిన ప్రచార గీతాల ఆడియోను సోమవారం సీఐటీయూ కార్యాలయంలో వారు ఆవిష్కరించారు. విశాఖలో తొలిసారి ఈ మహాసభలు జరగనుండడం గర్వకారణమన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్మిక వర్గాల హక్కులను కాలరాస్తున్నారని, ప్లాంట్ యాజమాన్యం 46 విభాగాల ప్రైవేటీకరణకు టెండర్లు పిలుస్తున్నా, ఎంపీలు, ఎమ్మెల్యేలు లేదని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు.

విదసం ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

మహారాణిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాల్లో రిజర్వేషన్ల విధానం గాడి తప్పిందని, ప్రతిభ సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులను ఓపెన్ కేటగిరీలోకి మార్చటం జీవో 77కు విరుద్ధమని, రోస్టర్‌లో వర్టికల్ పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద విదసం ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. వారి ర్యాంక్, మార్కుల జాబితాతో కూడిన వినతి పత్రాలు పట్టుకొని కలెక్టర్‌ను ఆశ్రయించారు. ప్రతిభ ఉన్నా కాల్ లెటర్లు రాలేదని ఆక్రోశించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఆందోళనలో బి.వెంకటరావు, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

మత్తు 'స్వరూపం'!

- ● డ్రాపింగ్ పాయింట్ లొకేషన్ పంపిన స్వరూపరాజు
- ● ఎండీఎంఏ కేసులో కొత్త పేరు
- ● బయటకు వస్తున్న మత్తు లింక్‌లు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

వైజాగ్ ప్రేమికుల డ్రగ్ కేసులో ప్రధాన నిందితుడు పోలీసులను తప్పుదారి పట్టించాడా?, వాంగ్మూలంలో వాస్తవాలు చెప్పకుండా గోప్యంగా ఉంచాడా? అంటే అవుననే అంటున్నాయి విశ్వసనీయవర్గాలు. కొద్దిరోజుల క్రితం వైజాగ్‌కు చెందిన అర్జా శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్ ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్స్‌తో ఈగల్ బృందానికి చిక్కిన విషయం తెలిసిందే. ఈ కేసును తవ్వేకొద్దీ కొత్త కోణాలు, లింక్‌లు బయటకు వస్తున్నాయి. వైజాగ్‌కు చెందిన లోహిత్ యాదవ్ డ్రాపింగ్ పాయింట్ లోకేషన్‌ను వాట్సాప్‌లో పంపాడని, అక్కడి నుంచి తాను డ్రగ్‌ను తీసుకున్నానని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. లోహిత్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత శ్రీవాత్సవ్ వాస్తవం చెప్పలేదని తేలింది. లోహిత్‌ను పోలీసులు విచారించగా అసలు విషయంతో పాటు కొత్తపేరు వెలుగులోకి వచ్చింది. శ్రీవాత్సవ్, హవీల నుంచి ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీన్ని తానే తెప్పించుకున్నట్టు లోహిత్ యాదవ్ వెల్లడించాడు. దీనికి సంబంధించి రూ.13 వేలను పేమెంట్ యాప్ ద్వారా పంపించాడు. దీంతో శ్రీవాత్సవ్, హవీల వద్ద ఉన్న ఎల్ఎస్‌డీ అతడిదేనని తేలిపోయింది. శ్రీవాత్సవ్‌తో లింక్‌లు ఉన్న లోహిత్ యాదవ్‌ను మాచవరం పోలీసులు ఒకటో ఏసీఎంఎం కోర్టులో సోమవారం హాజరుపరిచారు. అతడికి పోలీసులు 12వ తేదీ వరకు రిమాండ్ విధించింది.

ఇదీ లోహిత్ చరిత్ర

విశాఖపట్నం గొల్లపాలెం ప్రాంతానికి చెందిన జోగా లోహిత్ యాదవ్ ఖాళీగా ఉంటున్నాడు. అతడి తండ్రి విశాఖ మహానగర పాలక సంస్థలో సీనియర్ అసిస్టెంట్. లోహిత్ ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో డ్రగ్స్‌కు అలవాటుపడ్డాడు. బీవీకే కళాశాలలో డిగ్రీలో చేరిన లోహిత్ కొద్దిరోజుల క్రితమే విద్యను మధ్యలో ఆపేశాడు. అక్కడే స్నేహితుల ద్వారా ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్స్‌ను అలవాటు చేసుకున్నాడు. కళాశాల విద్యను ఆపేసిన లోహిత్ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. ఆ క్రమంలోనే శ్రీవాత్సవ్, స్వరూపరాజుతో పరిచయం ఏర్పడింది. డ్రగ్స్ విక్రయించే వారితో స్వరూపరాజుకు విస్తృత పరిచయాలు ఉన్నాయి.

ఎవరీ స్వరూపరాజు

లోహిత్ యాదవ్‌ను విచారించగా వైజాగ్‌కు చెందిన స్వరూపరాజు పేరు వెలుగులోకి వచ్చింది. అతడిని పోలీసులు ఏ6 నిందితుడిగా ఎఫ్ఆర్‌లో చేర్చబోతున్నారు. బెంగళూరులోని సింగసంద్ర మెట్రో రైల్వేస్టేషన్ వద్ద ఉన్న డ్రాపింగ్ పాయింట్‌ను శ్రీవాత్సవ్‌కు స్వరూపరాజు వాట్సాప్ ద్వారా పంపాడు. ఇప్పుడు ఈ స్వరూపరాజు ఎవరన్న దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. లోహిత్ యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న విషయం తెలియడంతో స్వరూపరాజు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఐదుగురు నిందితులు ఉన్నారు. నిందితులు ఒక్కొక్కరు దొరికే కొద్దీ ఈ లింక్‌ల సంఖ్య మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసులో స్వరూపరాజును ఆరో నిందితుడిగా చేర్చాలని కోరుతూ పోలీసులు కోర్టులో మెమో దాఖలు చేశారు. కోర్టు తదుపరి ఆదేశాల కోసం పోలీసులు చూస్తున్నారు.

కవాచ్ డీజిల్ లోకోమోటివ్ ప్రారంభం



ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్ఎం లలిత్ బొహ్రా బృందం

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు అత్యాధునిక సాంకేతికతతో విశాఖలోని డీజిల్ లోకోషెడ్ సిద్ధం చేసిన తొలి కవాచ్ డీజిల్ లోకోమోటివ్‌ను డీఆర్ం లలిత్ బొహ్రా పచ్చ జెండా ఊపి సోమవారం ప్రారంభించారు. ఇటీవల ఎలక్ట్రికల్ లోకోమోటివ్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆధునిక సాంకేతికతో కూడిన కొలిషన్ అవాయిడెన్స్ సిస్టమ్ అమర్చిన తొలి సరుకు రవాణా కవాచ్ లోకోమోటివ్‌ను ప్రారంభించిన ఘనత విశాఖలోని డీజిల్ లోకోషెడ్‌కు దక్కిందని పేర్కొన్నారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు.

నేడు రెండో దఫా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

... 5వ పేజీ తరువాయి

దరఖాస్తులో ఇచ్చిన ఆప్షన్ మేరకు ఒక పోస్టును ఎంపిక చేసుకోవాలి. తొలివిడత సర్టిఫికెట్ల పరిశీలనలో అటువంటి అభ్యర్థులు ఒక పోస్టు ఎంపిక చేసుకున్న తరువాత మిగిలిన పోస్టుల కోసం అభ్యర్థుల ఎంపికకు తాజాగా సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నారు. కాగా మంగళవారం ఉక్కునగరంలోని విమల విద్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లుచేశామని డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ఉద్యోగం ఇక్కడ... విధులు అక్కడ!

... 5వ పేజీ తరువాయి

చూడని డీఈ రామరాజును సింహాచలం ఎందుకు పంపుతున్నారనేదే ప్రధాన ప్రశ్న.

చెప్పే వెళుతున్నారు

శోభారాణి, ఈఓ, కనకమహాలక్ష్మి దేవస్థానం

డీఈ రామరాజు...కనకమహాలక్ష్మి దేవస్థానంలో పనిచేయకుండా సింహాచలం వెళ్లి పనిచేయడంపై ఈఓ శోభారాణిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, తనకు చెప్పే అక్కడకు వెళుతున్నారని సమాధానమిచ్చారు. అయితే దీనిపై ఎటువంటి రాతపూర్వకమైన ఉత్తర్వులు లేవని స్పష్టంచేశారు. ఇంజనీరింగ్ పనులు ఉన్నాయంటే అనుమతించామని చెప్పారు.

కౌన్సిల్ తీర్మానానికి తిలోదకాలు!

... 5వ పేజీ తరువాయి

ఆరోపించారు. జీవీఎంసీలో కూడా స్మార్ట్ సిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని కింద చేపట్టిన పనులతోపాటు కార్యాలయాన్ని జీవీఎంసీకి అప్పగించాలని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. దీంతో మేయర్ పీలా శ్రీనివాసరావు ఇకపై విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌కు పనులు అప్పగించడానికి వీల్లేదని, ఇప్పటివరకు ఉన్న ప్రాజెక్టులను, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని తీర్మానం చేస్తూ, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆ విషయాన్ని జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోకుండా గాజువాకలో ఏపీఐఐసీ కేటాయించిన స్థలంలో రూ.30 కోట్లతో భవనాలు నిర్మించేందుకు రెండు రోజుల కిందట టెండర్లు పిలవడం ఆశ్చర్యానికి గురిచేసినట్టయింది. నిబంధనల ప్రకారం కౌన్సిల్ ఆమోదం లేకుండా టెండర్‌లు పిలవకూడదనే నిబంధన ఉన్నప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు ఎందుకు అత్యుత్సాహం చూపించారనే దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అప్పన్న ఆలయ ఉద్యోగుల చేతివాటం

... 5వ పేజీ తరువాయి

సేవా సంస్థల ప్రతినిధులు ఆదాయం లెక్కింపు ప్రారంభించారు. మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో దేవస్థానం ట్రాన్స్‌పోర్టు విభాగంలో క్లీనర్‌గా పనిచేస్తున్న కె.రమణ కొన్ని రూ.500 నోట్లను తెల్లకాగితాల్లో చుట్టి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పంచదార్ల సురేష్‌కు అందజేశాడు. అతడు దానిని తన వద్ద ఉన్న హుండీ తాళాలు భద్రపరిచే బ్యాగ్‌లో దాచేశాడు. ఈ మొత్తం వ్యవహారం సీసీ టీవీ కెమెరాలో రికార్డయింది. ఈవో సీసీ టీవీ ఫుటేజిని పరిశీలిస్తుండగా చోరీ వ్యవహారం బయటపడింది. దీంతో ఆ ఇద్దరు ఉద్యోగులను తనిఖీ చేయాలని ఏఈఓ రమణమూర్తిని ఆదేశించారు. తనిఖీల్లో సురేష్ వద్ద ఉన్న బ్యాగ్‌లో 111 రూ.500 నోట్లు బయటపడ్డాయి. విచారించగా రమణ తనకు ఇచ్చినట్టు అంగీకరించాడు. ఈ ఘటనలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సురేష్‌ను విధుల నుంచి తప్పించడంతో పాటు పర్మినెంట్ ఉద్యోగి కె.రమణను ఈవో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. అనంతరం వారిపై గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తేజేశ్వరరావు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎంవీవీ/ఎంకే పార్క్‌లో ప్రభుత్వ భూమి

... 5వ పేజీ తరువాయి

ఉండడంతో అనేక ఉల్లంఘనలకు పాల్పడినా అధికారులు పట్టించుకోలేదు. తాజాగా రెవెన్యూ అధికారులు నోటీస్‌లు జారీచేసినందున, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అపార్టుమెంట్ అనుమతులు రద్దుకు షోకాజ్ ఇచ్చేందుకు అవకాశం ఉంది. కానీ రాష్ట్ర టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారుల ఒత్తిడితో తమకేమి పట్టనట్టుగా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తెలియక కొన్నాం..

కూర్మన్నపాలెంలో ఎంవీవీ/ఎంకే అపార్టుమెంటులో ఫ్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులను కలిసి గోడు చెప్పుకున్నారు. ఆ స్థలంలో ప్రభుత్వ భూమి ఉందని తమకు తెలియదని, తామంతా మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారమని, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నామని అధికారులకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలి

... 5వ పేజీ తరువాయి

వ్యక్తిగత కారణాలు చెప్పి బదిలీలు నిలపాలని కోరుతున్నారన్నారు. ఆ తరహా సిఫార్సులు తాను చేయబోనన్నారు. వైద్యులు తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ వ్యాధిని నిర్మూలించేందుకు నడుంబిగించిందని మంత్రి సత్యకుమార్ అన్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు రాకుండా జాగ్రత్తపడడంపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. క్యాన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తించేందుకు సర్వే చేపడుతున్నామని, కొందరు మహిళలు ముందుకురాకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సర్వే కోసం వేలాది మంది వైద్య సిబ్బందిని వినియోగిస్తున్నట్టు వెల్లడించారు. చికిత్స కంటే ముందుగా గుర్తించడమే కీలకమన్న విధానంతో ముందుకు వెళుతున్నామన్నారు. క్యాన్సర్ వల్ల తాను కుటుంబంలో ముగ్గురిని కోల్పోయానని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. అమ్మ, సోదరుడు, అక్క క్యాన్సర్‌తో మరణించినట్టు తెలిపారు. ఆ ఘటనలు తనను ఎంతగానో కలచివేశాయని, అందుకే క్యాన్సర్ మహమ్మారిపై ప్రజాప్రతినిధిగా పోరాటం చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ రంగంలో నిష్ణాతులను తయారుచేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు వెళుతున్నామన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అత్యాధునిక పరికాలు అందించడం గొప్ప విషయమన్నారు. మరోఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కేజీహెచ్ అంటే తనకు ఎంతో ఇష్టమని, రెండుసార్లు గుండెపోటు వస్తే ప్రాణాలు నిలిపిందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ వైస్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి, ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య, అంకాలజీ విభాగం వైద్యాధికారులు డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ శిల్ప, డాక్టర్ పాండురంగకుమారి, డాక్టర్ చంద్రశేఖరం నాయుడు, డాక్టర్ గిరినాథ్‌తోపాటు అధిక సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

పింఛన్ అందలేదని వృద్ధురాలి ఆవేదన

ఆరిలోవ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తనకు ఈనెల పింఛన్ అందలేదని ఆరిలోవ 13వ వార్డులోని పసుపులేటి అప్పల కొండ (78) ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తన భర్త జూన్‌లో మృతి చెందడంతో మరణ ధ్రువీకరణ పత్రాన్ని సచివాలయానికి అందజేశానని పేర్కొంది. భర్త మృతి చెందిన వెంటనే భార్యకు పింఛన్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇంతవరకు రాలేదని ఆమె తెలిపారు. వయోభారంతో పని చేయలేకపోతున్నానని, పింఛన్ అందితే ఆసరాగా ఉంటుందని పేర్కొంది. ఒకటో తేదీన కొత్త పింఛన్ వస్తుందని ఆశపడితే నిరాశ ఎదురైందని, అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

మెట్ల మార్గం పునరుద్ధరణ పనులు ప్రారంభం



పనులు జరుగుతున్న దృశ్యం

సింహాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఏప్రిల్ 30 చందనోత్సవం రోజున జరిగిన దుర్ఘటనలో దెబ్బతిన్న గోడ, మెట్ల పునర్నిర్మాణ పనులకు అధికారులు సోమవారం శ్రీకారం చుట్టారు. చందనయాత్ర వేకువజామున గోడకూలి ఏడుగురు భక్తులు మృత్యువాత పడడంతో ఆ మార్గాన్ని మూసివేశారు. అక్టోబరు 2న శమీపూజకు సింహాద్రినాథుడ్ని ఇదే మార్గంలో కొండదిగువకు తీసుకువస్తారు. దీంతో గోడ, మెట్లను పునర్నిర్మించాలని వైదికులు దేవదాయశాఖ మంత్రిని కోరారు. దీంతో దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈఓ పర్యాటకశాఖ ఇంజనీరింగ్ అధికారులకు రెండుసార్లు లేఖలు రాసినా ఫలితం లేకపోవడంతో దేవస్థానం నిధులు రూ.18 లక్షలతో మెట్లమార్గం పనులను చేపట్టారు. ఈ మేరకు గోడ అవశేషాలను యంత్రాల సాయంతో తొలగించారు.

ఆక్రమిత స్థలాలు స్వాధీనం చేసుకోవాలని వినతి

ఆనందపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామవరంలో ఇందిరమ్మ కాలనీ ఇళ్లల్లో ఆక్రమణకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈమేరకు సోమవారం వారు కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 2006లో సర్వే నెంబరు 11లో పేదలకు ఇందిరమ్మ కాలనీ పేరిట ఇళ్ల స్థలాలు అందజేశారు. కొందరు స్థానిక నాయకులు ఆరు స్థలాలను ఆక్రమించారు. ప్రస్తుత మార్కెట్ ప్రకారం వాటి విలువ సుమారు రూ. 50 లక్షల ఉంటుందని, ఆ స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరు పేదలకు ఇవ్వాలని వారు కోరారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 30, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 38, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 18, క్యారెట్ 44, దొండకాయలు 50, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 66, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 76, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలీ 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	117
లైవ్ ధర	137
విత్ స్కిన్	244
స్కిన్‌లెస్	254

ఎమ్మెల్యే చొరవతో కదిలిన సర్వే యంత్రాంగం

జేసీ ఆదేశాలతో భానునగర్‌లో నష్ట పరిహార భూముల సర్వే



భానునగర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు భానునగర్‌లో స్థలాలన్నీ తమకు నష్టపరిహారంగా ఇచ్చినవేనని, ప్రభుత్వ స్థలాలు కాదని, వెంటనే తమ ప్రాంతాన్ని 22ఏ నుంచి తొలగించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కలిసి భానునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని జేసీ కె.మయూర్ అశోక్‌తో మాట్లాడి, అనంతరం అసోసియేషన్ సభ్యులను ఆయన వద్దకు పంపారు. ఇది వరకు ప్రభుత్వ ప్రధాన సర్వేయర్ దుర్గాప్రసాద్ తన బృందంతో భానునగర్‌కు వచ్చి నష్ట పరిహార భూములను సర్వే జరిపారని, ఇవి 22-1బిలో ఉన్నాయని, త్వరలోనే నివేదిక సమర్పించి తగిన చర్యలు చేపడతామని సభ్యులకు సర్వేయర్ దుర్గాప్రసాద్ హామీ ఇచ్చారు. ఇకపై సభ్యులు తమ భూములను యథేచ్ఛగా వాడుకునేలా (రుణాలకు, అమ్ముకునేందుకు) చూస్తామని చెప్పారు. ఈ భూములను 22-1బి నుంచి తొలగించే అధికారం జేసీకి లేదని, రెవెన్యూ విభాగానికి సిఫారసు చేయగా అర్బన్ ఎమ్మార్వో కార్యాలయం నుంచి మండల సర్వేయర్ ముద్దుకృష్ణ, వీఆర్వో, ఆర్ఐలు సోమవారం భానునగర్ భూములను సర్వే జరిపారు. ఈ క్రమంలో స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ విన్నపానికి వెను వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జేసీ మయూర్ అశోక్‌లకు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.తమకు సహకరించిన ఆంధ్రజ్యోతికి కూడా ధన్యవాదాలు తెలియజేశారు. స్థలాల వివరాలను సర్వేయర్‌లకు వివరించిన వారిలో అసోసియేషన్ సభ్యులు వంకా శివశంకర్ లాజరస్, ఒమ్మి అప్పారావు, ఒమ్మి జగ్గారావు, ఎం.హైమా, శంకర్ , కిరణ్, సరస్వతి తదితరులు ఉన్నారు.



మూషిక వాహన గణపతిగా సంపత్ వినాయగర్‌స్వామి

మూషిక వాహన గణపతిగా సంపత్ వినాయగర్

సిరిపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ సంపత్ వినాయగర్ ఆలయంలో సోమవారం మూషిక వాహన గణపతిగా సంపత్ వినాయగర్ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం హోమం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నారాయణ సేవ చేయగా, సాయంత్రం భక్తి సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. నాదస్వర కచేరి, శతావధాని డా.తాత సందీప్‌శర్మ 'కిరాతార్జునీయం'పై ప్రవచనమిచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేశానికి ఆదర్శం సీఎం చంద్రబాబు

- ప్రజల భాగస్వామ్యంతో ప్రజారంజక పాలన
- ఎమ్మెల్యే రామకృష్ణబాబు



ఎంవీపీ కాలనీ,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్ల క్రితం ఇదే రోజున ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, నాలుగు సార్లు సీఎం చంద్రబాబు అనేక పథకాలు, కార్యక్రమాలు అమలుచేస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్నారని తూర్పు శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల వద్దకు పాలన నినాదం దేశంలోనే ఓ సంచలనమని పేర్కొన్నారు. జన్మభూమి ఓ వినూత్న పథకమని, పచ్చదనం..పరిశుభ్రతతో ప్రజల్లో చైతన్యం తెచ్చారని, బాలికా విద్యకు ప్రాధాన్యం, మహిళలకు దీపం పథకం, కులవృత్తులకు గౌరవం లభించేలా బీసీలకు ఆదరణ పథకం, ఎస్సీల రక్షణ కోసం పున్నయ్య కమిషన్ సూచనలు అమలు చేయడం, బీసీలకకు, మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడం, మైనార్టీలకు సంక్షేమం, భద్రత, ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశందేనని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు కారణమైన వ్యక్తి చంద్రబాబు అని పేర్కొన్నారు. విద్యుత్తు రంగంలో సంస్కరణలు అమలుచేయడం, ప్రైవేటు రంగంలో తొలి విమానాశ్రయం, టెలికాం సంస్కరణలకు కీలక సూచనలు, పీపీపీ విధానంలో జాతీయ రహదారులకు అంకురార్పణ, గ్రామాల్లో చక్కని రహదారులు, ఐటీకి ప్రాధాన్యతతో హైటెక్ సిటీ నిర్మాణం, భారీ సంఖ్యలో ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుకు కృషి, ప్రతి జిల్లాలో వైద్య కళాశాలల ఏర్పాటు, విజన్ 2020తో కొత్త పాలనకు నాంది పలకడం, 1.80 లక్షల మంది ఉపాధ్యాయుల నియామకం, పర్యాటకాభివృద్ధికి ప్రాధాన్యం, డిజిటల్ గవర్నెన్స్‌తో సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుదేనని తెలిపారు. అన్నా క్యాంటీన్ల నిర్వహణ, రైతుల కోసం ఇజ్రాయెల్ సాంకేతికతతో డ్రిప్ ఇరిగేషన్ ప్రవేశపెట్టడం, రైతులకు సబ్సిడీలు, యాంత్రీకరణ, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం, నదుల అనుసంధానం, దళితుల కోసం ఎస్సీ వర్గీకరణ, రియల్ టైం గవర్నెన్స్, అమరావతి రాజధాని నిర్మాణం, పేదరిక నిర్మూలనకు పీ4 వంటి భారీ సంస్కరణలు చేపట్టడం చంద్రబాబుకే సాధ్యమన్నారు.

డీసీసీబీ ఛైర్మన్‌ను కలిసిన పీఏసీఎస్ అధ్యక్షులు



డీసీసీబీ ఛైర్మన్ తాతారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధ్యక్షులు

ఆనందపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆనందపురం, వేములవలస సహకార సంఘాల నూతన అధ్యక్షులు పాండ్రంకి అప్పలరాజు, రౌతు నాగరాజు నగరంలోని డీసీసీబీ కార్యాలయంలో ఛైర్మన్ కోన తాతారావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. మార్టిగేజ్ రుణాలు ద్వారా ఇప్పటివరకు ఎకరాకు రూ. 5 లక్షల అందించేవారని, ఆనందపురంలో మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ. 10 లక్షలు పెంచాలని కోరారు. అలాగే డీసీసీబీ ద్వారా డ్వాక్రా మహిళలకు రుణాలు అందించాలని, వాణిజ్య బ్యాంకుల వలే సులభతరమైన రుణాలు ఇవ్వాలని చెప్పారు. అనంతరం వారు కోన తాతారావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ డీవీఎస్ వర్మ, తర్లువాడ సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, ఆనందపురం, వేములవలస పీఏసీఎస్‌ల సీఈఓలు ఎస్. నారాయణరావు, బి. దశావతారం, తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో 90 శాతం పింఛన్లు పంపిణీ



కృష్ణాకాలనీలో పింఛన్లు అందిస్తున్న జడ్పీ అయ్యప్పనాయుడు

భీమునిపట్నం,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :భీమిలి జోన్‌లో సోమవారం సామాజిక పింఛన్లను 90 శాతం పంపిణీ చేశామని జోన్ వన్ జడ్సీ అయ్యప్పనాయుడు తెలిపారు. ఆయన పట్టణంలోని కృష్ణాకాలనీ సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోన్‌లో మొత్తం 8564 మంది పింఛన్‌దారులు ఉండగా 7785 మందికి పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ పీడీ వీకే దొర, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది


ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు



వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

పద్మనాభం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసిన పల్ల వెంకటేశ్వరరావు పదవీ విరమణ సభలో సోమవారం ఆయన మాట్లాడారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. అనంతరం ఆయన వెంకటేశ్వరావు దంపతులను ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్ఎం వి. శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వి. రఘువర్మ, ఎంపీపీ రాంబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, సర్పంచ్ రమణ, అప్పలనాయుడు, గంగరాజు పాల్గొన్నారు.

ఎగువపేటలో బాహుబలి సెట్



ఆకట్టుకుంటున్న బాహుబలి సెట్‌లో వినాయక మండపం

భీమునిపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎగువపేటలో రుద్ర యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన బాహుబలి సెట్ భక్తులను ఆకట్టుకుంటుంది. రుద్ర బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో కారి శ్రీధర్ ఈ సెట్ వేశారు. వినాయక మండపం, స్టేజ్ అలంకరణ, గోపురం నిర్మాణం ఆకట్టుకుంటున్నాయి.

చంద్రబాబు గొప్ప పాలకుడు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాల్లోకి కొత్త తరాన్ని తీసుకువచ్చి నాయకులుగా తీర్చిదిద్దన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందని,తాను కూడా ఆయన తయారు చేసిన నాయకుడినేనని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.ఎంవీపీ కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంస్కరణలతో పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. తిరుపతి సమీపాన చిన్న గ్రామంలో పుట్టిన చంద్రబాబు ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకుండా విద్యార్థి నాయకుడి నుంచి సీఎం స్థాయికి చేరుకున్నారన్నారు. మొత్తం 5,442 రోజులు సీఎంగా బాధ్యతలు నిర్వహించి రికార్డ్ సాధించారన్నారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి శ్రీకారం చుట్టిన చంద్రబాబు మైక్రోసాఫ్ట్‌తో గేమ్ ఛేంజర్‌గా మార్చారన్నారు. అప్పులతో ఉన్న ఏపీని ఏడాదిలోనే అత్యున్నత స్థాయికి తెచ్చారని కొనియాడారు. విశాఖకు టీసీఎస్, అదానీ డేటా సెంటర్, కాగ్నిజెంట్, సత్వా, సిఫీ వంటి అంతర్జాతీయ సంస్థలను తీసుకువస్తున్నారన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైతే విశాఖ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం చంద్రబాబు సీఎంగా ప్రమాణం స్వీకారం చేసి 30 ఏళ్లు అంటూ ప్లకార్డులు ప్రదర్శించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, పీవీ నరసింహం, పిల్లా మంగమ్మ, మొల్లి హేమలత, గంటా నూకరాజు పాల్గొన్నారు.

మహిళా సెజ్‌కు భూమిని గుర్తించండి

మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా ఆర్థిక మండలి ఏర్పాటు చేయడానికి అవసరమైన భూమిని గుర్తించాలని ఏపీఐఐసీ అధికారులను ఎమ్మెల్యే గంటా ఆదేశించారు. సోమవారం ఆయన ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో ఏపీఐఐసీ అధికారులతో సమావేశమయ్యారు. భీమిలి నియోజకవర్గంలో కనీసం 50 ఎకరాలు గుర్తించాలని చెప్పారు.

ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నీకి ముగ్గురు ఎంపిక

విశాఖపట్నం స్పోర్ట్సు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే భారత జట్టుకు నగరానికి చెందిన బీవీఎస్‌కేలింగేశ్వరరావు, కేపీ నాయక్, సీహెచ్.సన్యాసిరావు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నెల 7 నుంచి థాయిలాండ్‌లో జరగనున్న ఈ టోర్నీలో లింగేశ్వరరావు పురుషుల 55 ప్లస్ విభాగంలో డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో... నాయక్ పురుషుల 60 ప్లస్ కేటగిరీలో డబుల్స్ సన్యాసిరావు పురుషుల 55 ప్లస్ విభాగంలో సింగిల్స్ డబుల్స్ మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ టోర్నీలో ప్రపంచ వ్యాప్తంగా 56 దేశాల నుంచి సీనియర్ షట్లర్లు పాల్గొంటున్న నేపథ్యంలో నగర క్రీడాకారులు దేశానికి పతకాలు అందించాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

5న న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

ముఖ్యఅతిథిగా హాజరు కానున్న సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్

సబ్బవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవం (8 నుంచి 12 వరకు) ఈ నెల ఐదో తేదీ ఉదయం విశాఖపట్నంలోని హోటల్ నోవాటెల్‌లో జరుగుతుందని ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు తెలిపారు. సోమవారం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారన్నారు. గౌరవ అతిథులుగా సుప్రీం కోర్టు నాయమూర్తులు జస్టిస్ పి.నరసింహ, జస్టిస్ జేకే మహేశ్వరి (డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ చాన్సలర్), ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎస్ఎన్ఎల్‌యూ చాన్సలర్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరవుతారన్నారు. అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్-2, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇతర కొత్త భవనాలను ప్రారంభిస్తారని, జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య విగ్రహాలను ఆవిష్కరిస్తారనిఇ చెప్పారు. మీడియా సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి : మేయర్



మేయర్‌తో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు సత్యనారాయణరాజు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన ఇంజనీరుగా బాధ్యతలు స్వీకరించిన పి.వి.వి.సత్యనారాయణరాజు నగర మేయర్ పీలా శ్రీనివాసరావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీలో పర్యవేక్షక ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న తనకు ప్రభుత్వం జీవీఎంసీ ప్రధాన ఇంజనీరుగా పదోన్నతి కల్పించిందని తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీలో పర్యవేక్షక ఇంజనీరుగా విధులు నిర్వహిస్తూ అదే జీవీఎంసీలో ప్రధాన ఇంజనీరుగా పదోన్నతి పొందడం అభినందనీయమన్నారు. ప్రధాన ఇంజనీరు హోదాలో అభివృద్ధి పనులు, ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని కోరారు. చేపట్టబోతున్న కొత్త ప్రాజెక్టులు, ప్రజలకు కల్పించవలసిన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచిస్తూ ఆయన్ను అభినందించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ విభాగంలో అతిథి అధ్యాపకులను నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీ సబ్జెక్ట్‌లో పీజీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నవంబరు 2న నిర్వహించే మౌఖిక పరీక్షకు హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 81065 43229 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

22వ వార్డు టీడీపీ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న బొట్టా వెంకటరమణ

మద్దిలపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శివాజీపార్క్ రోడ్డు సవేరాఫంక్షన్ హాల్లో సోమవారం టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో 22వ వార్డు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో వార్డు నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోడిబోయిన ఆనంద్, కార్యదర్శిగా మల్లా రవి, యువజన అధ్యక్షుడిగా ఎస్.కె.మదీనా, యూత్ కార్యదర్శిగా గుండాల శంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా గుణలక్ష్మి, కార్యదర్శిగా మండా శ్రీదేవిలను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గానికి వెంకటరమణ అభినందనలు తెలిపి, తెలుగుదేశం పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా పనిచేయాలని సూచించారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి అప్పారావు, వార్డు మాజీ అధ్యక్షుడు దువ్వి స్వామి పాల్గొన్నారు.

12వ వార్డులో...

ఆరిలోవ : జీవీఎంసీ పరిధిలోని 12వ వార్డు తోటగరువులో టీడీపీ సంస్థాగత ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగినట్లు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. వార్డు అధ్యక్షునిగా గాడి సత్యం, ప్రధాన కార్యదర్శిగా పోతిన భరత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షునిగా నూరాల బ్రహ్మం, రెండో ఉపాధ్యక్షుడిగా కె.గోపాల్‌ను ఎన్నుకున్నారు. వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, పోలారావు, ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు.

గణపతి ఆశీస్సులు అందరిపై ఉండాలి

మార్కెటింగ్ శాఖ డి.డి. శ్రీనివాస్

పెదవాల్తేరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గణనాథుని ఆశీస్సులు రైతులందరిపై ఉండాలని మార్కెటింగ్ శాఖ డి.డి. శ్రీనివాస్ అన్నారు. సోమవారం పెదవాల్తేరు రైతుబజార్‌లో గణేశ్ మండపం వద్ద రైతులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్టేట్ అధికారిణి సత్యకళతో కలిసి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా కళాకారుల కోలాటం అందరినీ అలరించింది. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారిణి సత్యకళ, సహాయకులు లోవరాజు, పలు రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు, రైతులు, వినియోగదారులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ జీపీ రాజశేఖర్, తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏయూ బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో అక్టోబరు 27, 28వ తేదీల్లో ట్రాన్సేషనల్ మెడిసిన్ ఇన్ క్యాన్సర్ అన్న అంశంపై వర్క్‌షాప్ జరగనుంది. ఈమేరకు వీసీ రాజశేఖర్ సోమవారం తన కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, వర్క్‌షాప్ కన్వీనర్ ఆచార్య పి. రాధిక, రాఘవరావు పాల్గొన్నారు. అలాగే ఏయూ సెంటర్ ఫర్ స్టడీస్ ఆఫ్ సోషల్ ఇన్‌క్లూజన్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు సంపాధకత్వంలో రూపొందించిన రెండు పుస్తకాలను కూడా వీసీ ఆవిష్కరించారు. మొదటి పుస్తకంలో 16 పరిశోధనా, రెండో పుస్తకంలో 12 పరిశోధనా పత్రాలు ఉన్నాయి.



సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో శివ బాలగణపతిగా అలంకరణ



అక్కయ్యపాలెంలోని ఆంధ్రజ్యోతి కార్యాలయం సమీపంలో శివగణపతిగా లక్ష్మీగణపతి దర్శనం -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం



మురళీనగర్‌లోని వాకర్స్ క్లబ్‌లో సోమవారం రాత్రి వినాయకుడి వద్ద శివలింగాకారంలో దీపాలు వెలిగించిన మహిళలు -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

దుర్గాగణపతి ఆలయం లడ్డూ రూ.1,11,006లకు వేలం



లడ్డూ వేలం పాడుకున్న సతీష్‌కుమార్‌తో కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ తదితరులు

సీతంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన 99 కిలోల లడ్డూను సోమవారం వేలం వేశారు. ఈ లడ్డును స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్ ఆర్య వేలంలో రూ.1,11,006 లకు లడ్డును దక్కించుకున్నారు. ఈ సొమ్మును పూజలు, అన్నదాన కార్యక్రమంలో వినియోగిస్తామని ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు.

సింహాద్రి అప్పన్న హుండీ ఆదాయం రూ.2.06 కోట్లు

సింహాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామికి హుండీల ద్వారా గత 28 రోజుల్లో సుమారు రూ.2.06 కోట్ల ఆదాయం సమకూరింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు ఆధ్వర్యంలో దేవదాయ శాఖ ప్రత్యేక అధికారులు బండారు ప్రసాద్, ఎంఎస్ఎన్ మూర్తి పర్యవేక్షణలో సోమవారం ఆలయ హుండీలను తెరిచి, పరకామణిలో లెక్కించారు. ఇందులో రూ.2,06,29,844 నగదు, 174 గ్రాముల స్వర్ణ, 10.335 కిలోల రజిత ఆభరణాలు లభించాయని ఈఓ ప్రకటించారు. వీటితో పాటు 1,306 యూఎస్ డాలర్లు, 100 ఒమన్ కరెన్సీ, కెనడా, సింగపూర్, యూఏఈ, సైదీ అరేబియా, ఖతార్, నేపాల్, మలేషియా, కువైట్, ఇంగ్లాండ్, తదితర దేశాల కరెన్సీ కొంత లభించింది. లెక్కింపు కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ సింగం రాధ, వివిధ విభాగాల సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షణాధికారులు, ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్, శ్రీహరి సేవా సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లి సామాజిక పించన్ల పంపిణీ



పింఛన్ సొమ్ము అందచేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం పరిధి 14వ వార్డు సీతమ్మధారని పలు ప్రాంతాల్లో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సోమవారం పలువురు ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందచేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

25వ వార్డులో..

సీతంపేట: ఏపీడీవో రాము పర్యవేక్షణలో 25వ వార్డులో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ సోమవారం దుర్గాగణపతి ఆలయం వద్ద ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, జనసేన వార్డు అధ్యక్షుడు ప్రకాష్, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఇసరపు వాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గండి బాబ్జీ జన్మదిన వేడుకలు



పండ్లు పంపిణీ చేస్తున్న గోపాల్‌రెడ్డి

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ జన్మదిన వేడుకలు మీడియా కో ఆర్డినేటర్ కె.గోపాలరెడ్డి ఆధ్వర్యంలో గ్రేటర్ 42వ వార్డులో సోమవారం ఘనంగా జరిగాయి. జగన్నాథపురంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వృద్ధులతో కేకు కోయించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి దువ్వి కాశీప్రసాద్, లక్ష్మీ గణేష్ ఆలయం ట్రస్టీ రమణమ్మ పాల్గొన్నారు.

భవన నిర్మాణాల్లో సెట్ బ్యాక్‌లు తప్పనిసరి

» ద్వారకానగర్‌లో భవన నిర్మాణాన్ని తనిఖీ చేసిన జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గర్గ్ ఆదేశం

సీతంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో భవన నిర్మాణదారులు తప్పనిసరిగా సెట్ బ్యాక్స్ నిబంధనలు పాటించకపోతే అనుమతులు ఉపసంహరిస్తామని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గర్గ్ హెచ్చరించారు. సోమవారం ఆయన జీవీఎంసీ సీటీ ప్లానర్ ధనుంజయతో కలిసి మూడో జోన్ పరిధి 27వ వార్డులోని ద్వారకానగర్ మొదటి లైన్‌లో భవన నిర్మాణ అనుమతులు కోరిన ప్రతిపాదిత వాణిజ్యసముదాయాన్ని పరిశీలించారు. ముందుగా అనుమతులు కోరుతూ ప్రతిపాదించిన జి ప్లస్ ఫోర్ వాణిజ్య సముదాయం ప్లాన్‌ను కమిషనర్ పరిశీలించారు. వాణిజ్య సముదాయంలో సెట్ బ్యాక్‌లు విడిచిపెట్టిన స్థలాలకు, రోడ్డు వెడల్పునకు కొలతలు నిర్వహించి, మార్ట్‌గేజ్ కోసం విడిచిపెట్టిన ఏరియాను కూడా పరిశీలించారు. ప్లాన్‌కు సంబంధించిన దస్తావేజులను క్షుణ్ణంగా పరిశీలించి వాణిజ్య సముదాయం నిర్మాణంలో ఎటువంటి లోపాలు లేకుండా ప్లాన్ ప్రకారమే నిర్మించాలన్నారు. అదేవిధంగా నిర్మాణంలో సెట్ బ్యాక్‌లు తప్పనిసరిగా పాటించి, గాలి, వెలుతురు వచ్చేలా అంతర్గత నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని సిటి ప్లానర్ ధనుంజయ, భవన నిర్మాణ యజమానులను కమిషనర్ ఆదేశించారు. నిర్మాణం జరుగుతున్నప్పుడు పూర్తిగా గ్రీన్ మ్యాట్ కప్పి ఉంచాలని, భవన నిర్మాణ సామగ్రిని రోడ్లపై వేయకుండా లోపల ఉంచుకోవాలన్నారు. నగరంలో భవనాలు, వాణిజ్య సముదాయాలు నిర్మించేటప్పుడు సంబంధిత నిర్మాణదారులు సెట్ బ్యాక్‌లు తప్పనిసరిగా పాటించేలా చర్యలు చేపట్టాలని సిటీ ప్లానర్‌కు, జోనల్ కమిషనర్ శివప్రసాద్‌కు కమిషనర్ ఆదేశించారు. డీసీపీ మధుసూదనరావు పాల్గొన్నారు.



భవన నిర్మాణ ప్లాన్ పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గర్గ్

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జనసేన కార్యకర్తలు

అల్లిపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుని 34వ వార్డు జనసేన అధ్యక్షుడు నీలం రాజు ఆధ్వర్యంలో అచ్చియ్యమ్మపేట వద్ద సోమవారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ విచ్చేసి జనసైనికుల మధ్య కేకు కట్ చేశారు. అనంతరం చిరు వ్యాపారులకు బడ్డీలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

92.16 శాతం పింఛన్లు పంపిణీ

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ వర్గాలకు చెందిన 1,60,445 మందిలో 1,47,869 మందికి (92.16 శాతం) సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామీణ మండలాల్లో 26,636 మందికిగాను 24,815మంది (93.16 శాతం)కి, జీవీఎంసీ పరిధిలో 1,33,793 మందికిగాను 1,23,054 మంది (91.96 శాతం)కి పింఛన్లు అందజేశారు. అదేవిధంగా గత నెలలో సుమారు 1,558 మంది దివ్యాంగులకు పెన్షన్లు నిలిపివేయగా, అందులో 1,200 మందికి ఈ నెల తిరిగి పంపిణీ చేశారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు, అధికారులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పాల్గొన్న కార్పొరేటర్, స్థానిక నాయకులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు లక్ష్మీనారాయణపురం-2లో రూ.88.05 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, ఈఈ పద్మావతి, డీఈ భరణి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

5న న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

సబ్బవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవం (8 నుంచి 12 వరకు) ఈ నెల ఐదో తేదీ ఉదయం విశాఖపట్నంలోని హోటల్ నోవాటెల్‌లో జరుగుతుందని ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు తెలిపారు. సోమవారం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారన్నారు. గౌరవ అతిథులుగా సుప్రీం కోర్టు నాయమూర్తులు జస్టిస్ పి.నరసింహ, జస్టిస్ జేకే మహేశ్వరి (డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ చాన్సలర్), ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎస్ఎన్ఎల్‌యూ చాన్సలర్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరవుతారన్నారు. అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్-2, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇతర కొత్త భవనాలను ప్రారంభిస్తారని, జాతిపిత మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య విగ్రహాలను ఆవిష్కరిస్తారని చెప్పారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు 'ఇంద్రగంటి'

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మశ్రీ ఇంద్రగంటి రామచంద్రమూర్తి చిరస్మరణీయులని ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి చైర్మన్ ఎ.వెంకటరావు శ్లాఘించారు. సోమవారం డాబాగార్డెన్స్ లలితాకాలనీ ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి కార్యాలయంలో రామచంద్రమూర్తి ప్రథమ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత రామచంద్రమూర్తి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. కొద్దిసేపు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఇంద్రగంటి ఆధ్యాత్మిక సేవలను కొనియాడారు. పి.జగన్‌మోహనరావు, సంయుక్త కార్యదర్శి వి.మధుసూదనరావు, ఎం.నాగేశ్వరరావు, లక్ష్మీ, గాయత్రీ, గీత, శిష్యులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

'రెండోసారి ఫిర్యాదులు రాకుండా చూసుకోండి'



సమస్య వింటున్న జెడ్సీ రాము

జ్ఞానాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి గతంలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు, సచివాలయ కార్యదర్శులు సక్రమంగా స్పందించడంలేదని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము అసంతృప్తి వ్యక్తంచేశారు. సోమవారం ప్రజల నుంచి మూడు వినతులు అందుకున్న ఆయన అధికారులతో సమీక్షిస్తూ ఫిర్యాదులు రెండుసారి రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. తాజాగా రెవెన్యూ విభాగానికి 2 ,పట్టణ ప్రణాళికా విభాగానికి ఒక అర్జీ అందాయి. ఈఈ పద్మావతి, తారాప్రసన్న, రెవెన్యూ అధికారులు బాబురావు, రాజ్యలక్ష్మి, టీపీఓ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలు గీతాల ఆడియో ఆవిష్కరణ

మహారాణిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలు విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, ఏయూ జర్నలిజం మాజీ విభాగాధిపతి బాబివర్ధన్‌లు తెలిపారు. మహాసభలు విజయవంతం చేయటానికి సినీ గేయ రచయిత సుద్దాల అశోకతేజ, నేపథ్య గాయకుడు రాంకీ ఆలపించిన ప్రచార గీతాల ఆడియోను సోమవారం సీఐటీయూ కార్యాలయంలో వారు ఆవిష్కరించారు. విశాఖలో తొలిసారి ఈ మహాసభలు జరగనుండడం గర్వకారణమన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్మిక వర్గాల హక్కులను కాలరాస్తున్నారని, ప్లాంట్ యాజమాన్యం 46 విభాగాల ప్రైవేటీకరణకు టెండర్లు పిలుస్తున్నా, ఎంపీలు, ఎమ్మెల్యేలు లేదని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు.

విదసం ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

మహారాణిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాల్లో రిజర్వేషన్ల విధానం గాడి తప్పిందని, ప్రతిభ సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులను ఓపెన్ కేటగిరీలోకి మార్చటం జీవో 77కు విరుద్ధమని, రోస్టర్‌లో వర్టికల్ పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద విదసం ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. వారి ర్యాంక్, మార్కుల జాబితాతో కూడిన వినతి పత్రాలు పట్టుకొని కలెక్టర్‌ను ఆశ్రయించారు. ప్రతిభ ఉన్నా కాల్ లెటర్లు రాలేదని ఆక్రోశించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఆందోళనలో బి.వెంకటరావు, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

మత్తు 'స్వరూపం'!

● డ్రాపింగ్ పాయింట్ లొకేషన్ పంపిన స్వరూపరాజు
● ఎండీఎంఏ కేసులో కొత్త పేరు
● బయటకు వస్తున్న మత్తు లింక్‌లు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

వైజాగ్ ప్రేమికుల డ్రగ్ కేసులో ప్రధాన నిందితుడు పోలీసులను తప్పుదారి పట్టించాడా?, వాంగ్మూలంలో వాస్తవాలు చెప్పకుండా గోప్యంగా ఉంచాడా? అంటే అవుననే అంటున్నాయి విశ్వసనీయవర్గాలు. కొద్దిరోజుల క్రితం వైజాగ్‌కు చెందిన అర్జా శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్ ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్స్‌తో ఈగల్ బృందానికి చిక్కిన విషయం తెలిసిందే. ఈ కేసును తవ్వేకొద్దీ కొత్త కోణాలు, లింక్‌లు బయటకు వస్తున్నాయి. వైజాగ్‌కు చెందిన లోహిత్ యాదవ్ డ్రాపింగ్ పాయింట్ లొకేషన్‌ను వాట్సాప్‌లో పంపాడని, అక్కడి నుంచి తాను డ్రగ్‌ను తీసుకున్నానని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. లోహిత్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత శ్రీవాత్సవ్ వాస్తవం చెప్పలేదని తేలింది. లోహిత్‌ను పోలీసులు విచారించగా అసలు విషయంతో పాటు కొత్తపేరు వెలుగులోకి వచ్చింది. శ్రీవాత్సవ్, హవీల నుంచి ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీన్ని తానే తెప్పించుకున్నట్టు లోహిత్ యాదవ్ వెల్లడించాడు. దీనికి సంబంధించి రూ.13 వేలను పేమెంట్ యాప్ ద్వారా పంపించాడు. దీంతో శ్రీవాత్సవ్, హవీల వద్ద ఉన్న ఎల్ఎస్‌డీ అతడిదేనని తేలిపోయింది. శ్రీవాత్సవ్‌తో లింక్‌లు ఉన్న లోహిత్ యాదవ్‌ను మాచవరం పోలీసులు ఒకటో ఏసీఎంఎం కోర్టులో సోమవారం హాజరుపరిచారు. అతడికి పోలీసులు 12వ తేదీ వరకు రిమాండ్ విధించింది.

ఇదీ లోహిత్ చరిత్ర

విశాఖపట్నం గొల్లపాలెం ప్రాంతానికి చెందిన జోగా లోహిత్ యాదవ్ ఖాళీగా ఉంటున్నాడు. అతడి తండ్రి విశాఖ మహానగర పాలక సంస్థలో సీనియర్ అసిస్టెంట్. లోహిత్ ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో డ్రగ్స్‌కు అలవాటుపడ్డాడు. బీవీకే కళాశాలలో డిగ్రీలో చేరిన లోహిత్ కొద్దిరోజుల క్రితమే విద్యను మధ్యలో ఆపేశాడు. అక్కడే స్నేహితుల ద్వారా ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్స్‌ను అలవాటు చేసుకున్నాడు. కళాశాల విద్యను ఆపేసిన లోహిత్ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. ఆ క్రమంలోనే శ్రీవాత్సవ్, స్వరూపరాజుతో పరిచయం ఏర్పడింది. డ్రగ్స్ విక్రయించే వారితో స్వరూపరాజుకు విస్తృత పరిచయాలు ఉన్నాయి.

ఎవరీ స్వరూపరాజు

లోహిత్ యాదవ్‌ను విచారించగా వైజాగ్‌కు చెందిన స్వరూపరాజు పేరు వెలుగులోకి వచ్చింది. అతడిని పోలీసులు ఏ6 నిందితుడిగా ఎఫ్ఆర్‌లో చేర్చబోతున్నారు. బెంగళూరులోని సింగసంద్ర మెట్రో రైల్వేస్టేషన్ వద్ద ఉన్న డ్రాపింగ్ పాయింట్‌ను శ్రీవాత్సవ్‌కు స్వరూపరాజు వాట్సాప్ ద్వారా పంపాడు. ఇప్పుడు ఈ స్వరూపరాజు ఎవరన్న దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. లోహిత్ యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న విషయం తెలియడంతో స్వరూపరాజు సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఐదుగురు నిందితులు ఉన్నారు. నిందితులు ఒక్కొక్కరు దొరికే కొద్దీ ఈ లింక్‌ల సంఖ్య మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసులో స్వరూపరాజును ఆరో నిందితుడిగా చేర్చాలని కోరుతూ పోలీసులు కోర్టులో మెమో దాఖలు చేశారు. కోర్టు తదుపరి ఆదేశాల కోసం పోలీసులు చూస్తున్నారు.

కవాచ్ డీజిల్ లోకోమోటివ్ ప్రారంభం



ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్ఎం లలిత్ బొహ్రా బృందం

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు అత్యాధునిక సాంకేతికతతో విశాఖలోని డీజిల్ లోకోషెడ్ సిద్ధం చేసిన తొలి కవాచ్ డీజిల్ లోకోమోటివ్‌ను డీఆర్ఎం లలిత్ బొహ్రా పచ్చ జెండా ఊపి సోమవారం ప్రారంభించారు. ఇటీవల ఎలక్ట్రికల్ లోకోమోటివ్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆధునిక సాంకేతికతో కూడిన కొలిషన్ అవాయిడెన్స్ సిస్టమ్ అమర్చిన తొలి సరుకు రవాణా కవాచ్ లోకోమోటివ్‌ను ప్రారంభించిన ఘనత విశాఖలోని డీజిల్ లోకోషెడ్‌కు దక్కిందని పేర్కొన్నారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు.

నేడు రెండో దఫా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

... 5వ పేజీ తరువాయి

దరఖాస్తులో ఇచ్చిన ఆప్షన్ మేరకు ఒక పోస్టును ఎంపిక చేసుకోవాలి. తొలివిడత సర్టిఫికెట్ల పరిశీలనలో అటువంటి అభ్యర్థులు ఒక పోస్టు ఎంపిక చేసుకున్న తరువాత మిగిలిన పోస్టుల కోసం అభ్యర్థుల ఎంపికకు తాజాగా సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నారు. కాగా మంగళవారం ఉక్కునగరంలోని విమల విద్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లుచేశామని డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ఉద్యోగం ఇక్కడ... విధులు అక్కడ!

... 5వ పేజీ తరువాయి

చూడని డీఈ రామరాజును సింహాచలం ఎందుకు పంపుతున్నారనేదే ప్రధాన ప్రశ్న.

చెప్పే వెళుతున్నారు

శోభారాణి, ఈఓ, కనకమహాలక్ష్మి దేవస్థానం

డీఈ రామరాజు...కనకమహాలక్ష్మి దేవస్థానంలో పనిచేయకుండా సింహాచలం వెళ్లి పనిచేయడంపై ఈఓ శోభారాణిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, తనకు చెప్పే అక్కడకు వెళుతున్నారని సమాధానమిచ్చారు. అయితే దీనిపై ఎటువంటి రాతపూర్వకమైన ఉత్తర్వులు లేవని స్పష్టంచేశారు. ఇంజనీరింగ్ పనులు ఉన్నాయంటే అనుమతించామని చెప్పారు.

కౌన్సిల్ తీర్మానానికి తిలోదకాలు!

... 5వ పేజీ తరువాయి

ఆరోపించారు. జీవీఎంసీలో కూడా స్మార్ట్ సిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని కింద చేపట్టిన పనులతోపాటు కార్యాలయాన్ని జీవీఎంసీకి అప్పగించాలని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. దీంతో మేయర్ పీలా శ్రీనివాసరావు ఇకపై విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌కు పనులు అప్పగించడానికి వీల్లేదని, ఇప్పటివరకు ఉన్న ప్రాజెక్టులను, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని తీర్మానం చేస్తూ, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆ విషయాన్ని జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోకుండా గాజువాకలో ఏపీఐఐసీ కేటాయించిన స్థలంలో రూ.30 కోట్లతో భవనాలు నిర్మించేందుకు రెండు రోజుల కిందట టెండర్లు పిలవడం ఆశ్చర్యానికి గురిచేసినట్టయింది. నిబంధనల ప్రకారం కౌన్సిల్ ఆమోదం లేకుండా టెండర్‌లు పిలవకూడదనే నిబంధన ఉన్నప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు ఎందుకు అత్యుత్సాహం చూపించారనే దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అప్పన్న ఆలయ ఉద్యోగుల చేతివాటం

... 5వ పేజీ తరువాయి

సేవా సంస్థల ప్రతినిధులు ఆదాయం లెక్కింపు ప్రారంభించారు. మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో దేవస్థానం ట్రాన్స్‌పోర్టు విభాగంలో క్లీనర్‌గా పనిచేస్తున్న కె.రమణ కొన్ని రూ.500 నోట్లను తెల్లకాగితాల్లో చుట్టి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పంచదార్ల సురేష్‌కు అందజేశాడు. అతడు దానిని తన వద్ద ఉన్న హుండీ తాళాలు భద్రపరిచే బ్యాగ్‌లో దాచేశాడు. ఈ మొత్తం వ్యవహారం సీసీ టీవీ కెమెరాలో రికార్డయింది. ఈవో సీసీ టీవీ ఫుటేజిని పరిశీలిస్తుండగా చోరీ వ్యవహారం బయటపడింది. దీంతో ఆ ఇద్దరు ఉద్యోగులను తనిఖీ చేయాలని ఏఈఓ రమణమూర్తిని ఆదేశించారు. తనిఖీల్లో సురేష్ వద్ద ఉన్న బ్యాగ్‌లో 111 రూ.500 నోట్లు బయటపడ్డాయి. విచారించగా రమణ తనకు ఇచ్చినట్టు అంగీకరించాడు. ఈ ఘటనలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సురేష్‌ను విధుల నుంచి తప్పించడంతో పాటు పర్మినెంట్ ఉద్యోగి కె.రమణను ఈవో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. అనంతరం వారిపై గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తేజేశ్వరరావు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎంవీవీ/ఎంకే పార్క్‌లో ప్రభుత్వ భూమి

... 5వ పేజీ తరువాయి

ఉండడంతో అనేక ఉల్లంఘనలకు పాల్పడినా అధికారులు పట్టించుకోలేదు. తాజాగా రెవెన్యూ అధికారులు నోటీస్‌లు జారీచేసినందున, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అపార్టుమెంట్ అనుమతులు రద్దుకు షోకాజ్ ఇచ్చేందుకు అవకాశం ఉంది. కానీ రాష్ట్ర టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారుల ఒత్తిడితో తమకేమి పట్టనట్టుగా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తెలియక కొన్నాం..

కూర్మన్నపాలెంలో ఎంవీవీ/ఎంకే అపార్టుమెంటులో ఫ్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులను కలిసి గోడు చెప్పుకున్నారు. ఆ స్థలంలో ప్రభుత్వ భూమి ఉందని తమకు తెలియదని, తామంతా మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారమని, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నామని అధికారులకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలి

... 5వ పేజీ తరువాయి

వ్యక్తిగత కారణాలు చెప్పి బదిలీలు నిలపాలని కోరుతున్నారన్నారు. ఆ తరహా సిఫార్సులు తాను చేయబోనన్నారు. వైద్యులు తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ వ్యాధిని నిర్మూలించేందుకు నడుంబిగించిందని మంత్రి సత్యకుమార్ అన్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు రాకుండా జాగ్రత్తపడడంపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. క్యాన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తించేందుకు సర్వే చేపడుతున్నామని, కొందరు మహిళలు ముందుకురాకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సర్వే కోసం వేలాది మంది వైద్య సిబ్బందిని వినియోగిస్తున్నట్టు వెల్లడించారు. చికిత్స కంటే ముందుగా గుర్తించడమే కీలకమన్న విధానంతో ముందుకు వెళుతున్నామన్నారు. క్యాన్సర్ వల్ల తాను కుటుంబంలో ముగ్గురిని కోల్పోయానని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. అమ్మ, సోదరుడు, అక్క క్యాన్సర్‌తో మరణించినట్టు తెలిపారు. ఆ ఘటనలు తనను ఎంతగానో కలచివేశాయని, అందుకే క్యాన్సర్ మహమ్మారిపై ప్రజాప్రతినిధిగా పోరాటం చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ రంగంలో నిష్ణాతులను తయారుచేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు వెళుతున్నామన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అత్యాధునిక పరికాలు అందించడం గొప్ప విషయమన్నారు. మరోఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కేజీహెచ్ అంటే తనకు ఎంతో ఇష్టమని, రెండుసార్లు గుండెపోటు వస్తే ప్రాణాలు నిలిపిందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి, ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య, అంకాలజీ విభాగం వైద్యాధికారులు డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ శిల్ప, డాక్టర్ పాండురంగకుమారి, డాక్టర్ చంద్రశేఖరం నాయుడు, డాక్టర్ గిరినాథ్‌తోపాటు అధిక సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పల్లవి

చట్టాలపై అవగాహన అవసరం

మూడో అదనపు చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వి.పల్లవి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ హక్కుల చట్టంతో పాటు బాల్య వివాహాలు వంటి చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కలిగివుండడం ఎంతో అవసరమని మూడో అదనపు చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వి.పల్లవి అన్నారు. మింది హైస్కూల్‌లో సోమవారం పలు చట్టాలు, వాటి ఉపయోగాలపై విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాల వల్లే బాలికలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని నిరోధించేందుకు విద్యావంతులు కావడంతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో గాజువాక సీఐ పార్థసారథి, ప్రధానోపాధ్యాయుడు పీవీఎస్ ఆంజనేయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

4 నుంచి క్రీడా పోటీలు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గాజువాక ప్రాంతంలో గల ప్రైవేటు పాఠశాలల ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్‌ను ఈ నెల 4, 5, 11, 12 తేదీల్లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టరును సోమవారం గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్పోర్ట్స్‌మీట్‌ను గాజువాకలో నిర్వహించనుండడం గొప్ప విషయమన్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు క్రికెట్, కోకో, చదరంగం, క్యారమ్స్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఎ.వాసుదేవరావు, ఎస్‌వీకే పరశురాం, సత్యనారాయణ, లక్ష్మణరావు, త్రినాథరావు, ప్రసాదరావు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలని వినతి

పెదగంట్యాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ బీఎంఎస్, స్టీల్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ నాయకులు భీమవరంలో కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను సోమవారం కలిసి వినతపత్రం అందజేశారు. కాంట్రాక్టు కార్మికుల భవిష్యత్తుకు భరోసా ఉండాలంటే ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. ఇప్పటికే సుమారు ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం తొలగించిందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాటూరు వెంకట సన్యాసినాయుడు, స్టీల్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి గొందేశి గురప్పరెడ్డి, స్టీల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాస్, నాయకులు ఎం.రామస్వామి, జె.రమణ, హరీశ్వర్మ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
● **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
● **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
● **యూనివర్సిటీ** : శ్రీకాంతి
● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 30, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 38, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 18, క్యారెట్ 44, దొండకాయలు 50, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 66, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, బీన్స్ (పెన్సిల్) 76, కొబ్బరికాయ (పెద్దది) 35, కీరదోస 30, క్యాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడుచిక్కుడు 74, గోరుచిక్కుడు 32, కూరపెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, కర్రపెండలం 24, బూడిద గుమ్మడికాయ 20, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	117
లైవ్ ధర	137
విత్ స్కిన్	244
స్కిన్‌లెస్	254



గాజువాకలో జరిగిన స్త్రీశక్తి సదస్సుకు హాజరైన మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

స్త్రీశక్తి సదస్సులో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ వారి అభ్యున్నతికి అండగా నిలుస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలో సోమవారం నిర్వహించిన స్త్రీశక్తి సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో ప్రత్యేకంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబునాయుడికే దక్కుతుందన్నారు. తమది సుపరిపాలనను అందించే ప్రభుత్వమన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ప్రత్యేక రక్షణ చేకూరేలా పటిష్ఠ చర్యలు చేపట్టిందన్నారు. సీఎం చంద్రబాబు మహిళల పక్షపాతి అని, భవిష్యత్తులో వారి సంక్షేమానికి మరిన్ని పథకాలను అమలు చేయడం జరుగుతుందని పల్లా పేర్కొన్నారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మహిళలకు మంచిరోజులు వచ్చాయన్నారు. మహిళలకు అన్ని విధాలా మేలు చేకూర్చి, వారికి ఉన్నత గుర్తింపును తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. బీజేపీ నాయకుడు కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారన్నారు. సదస్సుకు టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్లలో కొందరిని తొలగించారంటూ వైసీపీ నాయకులు చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. 76వ వార్డు పరిధిలోని గోపాలరెడ్డి నగర్, గాంధీ నగర్ కాలనీల్లో సోమవారం ఆయన పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా ఏపీలో జరుగుతున్న సామాజిక పెన్షన్ల పంపిణీ పథకం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కొందరు దివ్యాంగుల పెన్షన్లను తొలగించారంటూ వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారంలోనూ నిజం లేదన్నారు. కార్పొరేటర్, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ పింఛన్ల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలో మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో జడ్సీ బీఆర్ఎస్ శేషాద్రి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

86, 87 వార్డుల్లో పింఛన్ల పంపిణీ

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి వుడా నగర్, రాజీవ్ నగర్, పకీరుతఖ్యా సచివాలయాల పరిధిలో గల లబ్ధిదారులకు టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి నాయకులు కాద శ్రీను, వేగుంట శ్రీనువాస్, బి.జగదీశ్, కె.రమేశ్, ఎం.గణపతి, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే 87వ వార్డు పరిధి వడ్లపూడి సచివాలయ పరిధిలో గల లబ్ధిదారులకు కార్పొరేటర్ బొండా జగన్ పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఈ పెన్షన్లు ఆర్థిక భరోసాను అందిస్తాయన్నారు. టీడీపీ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, ప్రకాశ్, రాజన్‌రాజు, పెంటారావు, శ్రీనువాస్‌నాయుడు, దానయ్య, తదితరులు పాల్గొన్నారు.



మహిళకు పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ బొండా జగన్

‘విజ్ఞాన్’లో సెయిండియా క్లబ్ ఏర్పాటు

అగనంపూడి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సెయిండియా క్లబ్‌ను ఏర్పాటు చేశారు. హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఇమ్తియాజ్ అర్షాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ క్లబ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆటో మొబైల్, ఏరోస్పేస్, ఎలక్ట్రిక్ వెహికల్స్, కొత్త టెక్నాలజీపై అవగాహన పెంచుకునేందుకు సెయిండియా క్లబ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం అర్షాద్‌ను విజ్ఞాన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఎస్ఎస్‌టీఎల్ హెడ్ కేటీ మిథున్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారులందరికీ స్మార్ట్ కార్డులు

గాజువాక, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులందరికీ స్మార్ట్ కార్డులను అందజేయడం జరుగుతుందని సర్కిల్-3 ఏఎస్‌వో కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులందరూ తమకు సమీపంలో గల సచివాలయాల్లో స్మార్ట్ కార్డులను పొందవచ్చన్నారు. ఈ నెల పదో తేదీ వరకు సచివాలయాల్లో, పది నుంచి 15వ తేదీ వరకు రేషన్ డిపోల్లో స్మార్ట్ కార్డులను పొందవచ్చన్నారు. అప్పటికీ ఎవరైనా తీసుకోకపోతే గాజువాకలోని ఏఎస్‌వో కార్యాలయంలో వాటిని పొందవచ్చని పేర్కొన్నారు. కాగా కొత్తగా రేషన్ కార్డుల దరఖాస్తు చేసుకున్న వారికి రెండో విడత స్మార్ట్ కార్డులను అందజేస్తామని కృష్ణ తెలిపారు.

చెరువు అభివృద్ధి పట్ల హర్షం

అగనంపూడి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బొర్రమాంబ ఆలయానికి సమీపంలో గల గుండం చెరువు అభివృద్ధికి పనులు చేపట్టడం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం 85వ వార్డు కూటమి నాయకులు ఈ చెరువును సందర్శించి, అభివృద్ధి పనులను పరిశీలించారు. గుండం చెరువును అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పల్లా దృష్టికి తీసుకువెళ్లడంతో ఇక్కడ వాకింగ్ ట్రాక్ పనులు చేపట్టారన్నారు. నాయకులు కర్రి దేవేంద్ర, జి.సోమశేఖర్, రమేశ్, బాబ్జీ, మంగరాజు, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

పెందుర్తి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే పంచకర్ల ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని సుజాతనగర్ దాట్ల కన్వెన్షన్‌లో నిర్వహించనున్నారు. అనంతరం స్థానిక రైతుబజార్‌లో రైతులకు సత్కారం, భవన నిర్మాణ కార్మికులను అల్పాహారం, పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేయనున్నారు. ఈ మెగా రక్తదాన శిబిరానికి కూటమి నాయకులు తరలిరావాలని కోరారు.

అనాథకు అంత్యక్రియలు

» మానవత్వం చాటిన కానిస్టేబుల్

పెందుర్తి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అనాథకు అంత్యక్రియలు నిర్వహించి కానిస్టేబుల్ గోవిందరావు మానవత్వం చాటుకున్నారు. లంకడ సతీశ్(50) ఎవరూ లేకపోవడంతో రోడ్ల మీద అనాథలా తిరిగేవాడు. పోలీసులు చొరవ తీసుకుని స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో చేర్పించారు. అనారోగ్యం కారణంగా ఆదివారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ గోవిందరావు తన సొంత ఖర్చులతో స్థానిక శ్మశానవాటికలో ఖననం చేశారు.

పీజీఆర్ఎస్‌కు 7 ఫిర్యాదులు

వేపగుంట సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా 90వ వార్డు విమాన్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, 91వ వార్డు గోపాలపట్నంలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని, 94వ వార్డు బీసీకాలనీలో రహదారి నిర్మాణం చేపట్టాలని, అదేవిధంగా అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని, 95వ వార్డు చిమలాపల్లిలో అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని తదితర ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖాధిపతులకు పంపిస్తామని జడ్సీ కె.హైమావతి తెలియజేశారు.

నేడు శంకరరావు జయంతి వేడుకలు

వేపగుంట సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర, ఒరిస్సా రాష్ట్రంలో అత్యాధునిక కంటి వైద్యం అందిస్తున్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకరరావు 94వ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించనున్నట్టు ఆస్పత్రి డీజీఎమ్ కె.బంగారరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శంకరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆస్పత్రి అభివృద్ధికి క్యాంపులు ఏర్పాటు చేసి కంటి పరీక్షలకు సహకరించిన ఉత్తరాంధ్ర జిల్లాల్లో కన్వీనర్లకు ప్రత్యేక మెమొంటోలు ఇవ్వనున్నామని ఆ ప్రకటన ద్వారా తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం లక్ష్యం: ఎంపీ భరత్



వేదికపై మహిళలతో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పి.గణబాబు



కార్యక్రమానికి హాజరైన మహిళలు

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని ఎంపీ శ్రీభరత్ అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు ఎన్ఏడీ వంతెల్లు వద్ద ఏర్పాటు చేసిన ‘స్త్రీశక్తి’ పథకం బహిరంగ సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితం కాకుండా, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ‘సీఎం క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పినప్పుడు ఆ టెక్నాలజీ ఉపయోగాలు ఏవిధంగా ఉంటాయో నాకు కూడా తెలియదు. అటువంటి విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు. పేదరికాన్ని నిర్మూలించే పీ4 పథకం కూడా ఆయన విజనరీ నుంచి వచ్చినదే’ అని భరత్ అన్నారు. అనంతరం ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ ఆవిర్భవించిందన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు మహిళలను, ఆర్థికంగా వెనుకబడిన వారిని ఉన్నతంగా తీసుకువెళ్లేందుకు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశ పెట్టారని అన్నారు. ఆ పథకాలు ప్రజల్లోకి పూర్తిగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత మహిళలకు ఉందన్నారు. ఈ సమావేశంలో అవయవధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన గూడూరు సీతామహాలక్ష్మి, మహిళా శక్తిగా అంగ ప్రశాంతి, క్రిస్టియన్ సేవకురాలు నన్ లీసీ, బీజేపీ నాయకురాలు నాదేండ్ల జ్యోతి సీరమ్ ఉమామహేశ్వరి తదితర మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పరిశీలకురాలు రంగనాయకులు, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గండి బాబ్జీ జన్మదిన వేడుకలు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు



కేకు కోస్తున్న గండి వంశీదీప్, మేయర్ పీలా శ్రీనివాసరావు

పెందుర్తి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీసీపీజీఎఫ్ ఎల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ జన్మదిన వేడుకలు సోమవారం పెందుర్తిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వెలమభవన్‌లో టీడీపీ శ్రేణులు, గండి బాబ్జీ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని మేయరు పీలా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో 70మంది యువకులు రక్తదానం చేశారు. కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ కేకును బాబ్జీ తనయుడు, టీడీపీ యువనేత గండి వంశీదీప్ కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం గల బాబ్జీ ప్రజల మనిషిగా గుర్తింపు పొందారని, ఎప్పుడూ కార్యకర్తలకు అండగా నిలిచారని అన్నారు. అనంతరం సేవా కార్యక్రమాల్లో భాగంగా లయోలా వృద్ధాశ్రమంలో భోజన సదుపాయం, ఆస్పత్రిలో పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అవగడ్డ జ్యోతి అప్పలనాయుడు కార్పొరేటర్ సేనాపతి శంకరరావు, మాజీ జడ్పీటీసీ రెడ్డి నారాయణరావు టీడీపీ సీనియర్ నేతలు వేగి పరమేశ్వర రావు, గండి దేవుడు, సుఖవాసి అజయ్, సబ్బవరపు రామ్‌కుమార్, చీర అప్పలరాజు, వెన్నెల పెంటబాబు, గనిశెట్టి కనకరాజు, దూది వెంకటరమణ, పినిశెట్టి జగన్నాథం, పెంటకోట రాజేంద్రప్రసాద్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుబజారులో అన్నసమారాధన

గోపాలపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక రైతు బజారులో సోమవారం అన్న సమారాధన ఘనంగా జరిగింది. రైతు బజార్ ఎస్టేట్ అధికారి ప్రసాద్ ప్రారంభించిన ఈ కార్యక్రమంలో వర్తకులు, రైతులు, కొనుగోలుదారులు సుమారు వెయ్యి మంది స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

నార సంచుల పంపిణీ

గోపాలపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేడీ ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొత్తపాలెం, సంతోశ్‌నగర్‌లో సోమవారం నారసంచుల ను పంపిణీ చేశారు. అలాగే గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో వినయక మండపాల వద్ద జరుగుతున్న అన్నసమారాధల దగ్గర భక్తులకు నార సంచులను పంపిణీ చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నల్లూరు సూర్యనారాయణ

స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు టీడీపీ కృషి

దుష్ప్రచారాలకు పాల్పడుతున్న కార్మిక సంఘాల నాయకులు

86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు తెలుగుదేశం పార్టీ విశేష కృషి చేస్తుందని 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. మాతృశ్రీ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో 50 శాతం మంది నిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్నారు. గత కొన్ని నెలలుగా కూటమి ప్రభుత్వంపై బురద చల్లుతూ పలువురు కార్మిక సంఘ నాయకులు దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారన్నారు. గత ప్రభుత్వానికి కొన్ని కార్మిక సంఘాలు కోవర్టులుగా వ్యవహరించాయే తప్పా కార్మికుల సంక్షేమానికి చేసిందేమీ లేదన్నారు. కాంట్రాక్టు కార్మికుల నుంచి లక్షలాది రూపాయల వసూళ్లకు పాల్పడిన కార్మిక సంఘ నాయకులు.. ఇప్పుడు కార్మికులకు విధుల నుంచి తొలగించడంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తుండడంతో కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే పల్లా శ్రీనివాసరావు ఉక్కు పరిరక్షణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని గుర్తు చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని పేర్కొన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి వేగుంట శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలను కార్మిక సంఘ నాయకులు విడనాడాలన్నారు. సమావేశంలో నాయకులు బొడ్డే జగదీశ్, మానాపురం గణపతి, సుబ్బయ్య, నాయుడు, గోవింద్, సింహాద్రి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 296 జీవో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు

గాజువాక, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గాజువాక మండల పరిధిలో 296 జీవో ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు చెందిన స్థలాలకు మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్లు చేయనున్నట్టు తహశీల్దార్ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు వేలకు పైగా లబ్ధిదారులున్నప్పటికీ ప్రస్తుతం 2,668 మందికి గాజువాక, పెదగంట్యాడ, లంకెలపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయడం జరుగుతందన్నారు. లబ్ధిదారులందరూ సమీపంలో గల సచివాలయాలకు తమ వద్దనున్న పత్రాలతో వెళ్లి వీఆర్వోలను సంప్రదించాలని సూచించారు. వీఆర్వో ఆ పత్రాలను పరిశీలించాక రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అన్ని వివరాలు తెలియజేస్తారని పేర్కొన్నారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి: జడ్సీ

గాజువాక, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో పేర్కొన్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని జోనల్ కమీషనర్ శేషాద్రి పేర్కొన్నారు. సోమవారం జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు హాజరైన పలు విభాగాల అధికారులతో జడ్సీ సమీక్ష నిర్వహించారు. ప్రతివారం ప్రజలు పీజీఆర్ఎస్‌లో పలు సమస్యలపై అర్జీలు అందజేస్తున్నందున తమ విభాగాల పరిధిలో గల ఆయా సమస్యలను త్వరితంగా పరిష్కరించాలని సూచించారు. కాగా వివిధ సమస్యలకు సంబంధించి 12 అర్జీలు అందాయి.

సంపత్ వినాయక ఆలయంలో గంధ బిళ్వార్చన

అగనంపూడి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెదమడక సంపత్ వినాయక ఆలయంలో గణపతి నవరాత్రుల్లో భాగంగా సోమవారం విశేష గంధ బిళ్వార్చన చేశారు. అలాగే అష్టోత్తర శతమార్చన, పంచహారతితో పాటు సహస్ర దీపాలంకరణ చేశారు. కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, నెల్లి శ్రీనివాసరావు, ఎం.నరసింగరావు, వి.నారాయణరావు, ఎం.శ్రీనివాసరావు, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం



తహశీల్దార్ రమేశ్ నాయుడు

మల్కాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ములగాడ మండలంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభంకానుంది. నగరంలో చౌట్రి వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇంటిపట్టాలు రిజిస్ట్రేషన్ చేయనున్నట్టు ములగాడ మండల తహశీల్దార్ రమేశ్ నాయుడు తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి లబ్ధిదారుడు ఫొటో, ఆధార్‌కార్డు, ఇద్దరు సాక్షులు వారి ఆధార్ కార్డులను తీసుకుని వస్తే ప్రస్తుతం నివాసం ఉంటున్న స్థలం లబ్ధిదారుడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తామని ఆయన తెలిపారు. రోజుకు 30 రిజిస్ట్రేషన్‌లు చేయనున్నామన్నారు. అయితే లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ కోసం ఒక రోజుముందు తహశీల్దార్ కార్యాలయం నుంచి ఫోన్ వస్తుందని ఆయన తెలిపారు. మండలంలో 7,156 రిజిస్ట్రేషన్‌లు జరగనున్నాయని వెల్లడించారు. అయితే రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన పత్రాలన్నీ ఇప్పటికే ములగాడ మండల కార్యాలయానికి చేరుకున్నాయని తెలిపారు.

ఆమడ దూరంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం

ములగాడ మండలానికి గాజువాక, పెదగంట్యాడ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు సమీపంలో ఉన్నాయి. వీటిని కాదని నగరంలో చౌట్రి వద్ద ఉన్న కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు ఏర్పాటు చేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే రాను పోను 30 కిలోమీటర్లు ప్రయాణం చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రహదారి కూడా ఏమాత్రం బాగోదని పలువురు పేర్కొన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే పి.గణబాబు చొరవ చూపి ఈ ప్రాంతానికి సమీపంలో రిజిస్ట్రేషన్‌లు జరిగే విధంగా చూడాలని ఈ ప్రాంత వారు కోరుతున్నారు.

డ్రైవర్లది కష్టమైన జీవనం

» పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి. గణబాబు

మల్కాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు అనేక కష్టాలు పడుతూ జీవనం కొనసాగిస్తున్నారని, అవసరమైతే వారికి ప్రభుత్వం తరఫున సహకారం అందే విధంగా కృషి చేస్తానని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు హామీ ఇచ్చారు. డ్రైవర్స్‌డే సందర్భంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రాంగణంలో ఏపీ డ్రైవర్స్ మహా సంఘం, ఆంధ్రా మోటర్ ట్యాంక్ లారీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ల చేతిలో ఎంతోమంది ప్రాణాలు ఉంటాయని అందువల్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మద్యం తాగి వాహనం నడపరాదని సూచించారు. అనంతరం కేక్‌కట్‌చేసి డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాట్ల కుమార్ రాజు, రాష్ట్ర ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరావు, మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు, లారీ యూనియన్ సభ్యులు, సుమారు 500 మంది డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఊరట చెందిన ప్రజలు

గోపాలపట్నం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముసురు తగ్గిన తరువాత ఎండలు పెరగడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సోమవారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పు వచ్చి తేలికపాటి వర్షం కురవడంతో ప్రజలు కొంత ఊరట చెందారు. రోజూ సాయంత్రం గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు జోరందుకుంటాయి. అయితే ముసురు ప్రభావంతో ఫుట్‌పాత్‌పై వ్యాపారులు లేక రహదారి బోసిపోయింది.

అడవిపై అవగాహన

- సందర్శకులను అలరిస్తున్న కంబాలకొండ అభయారణ్యం
- ఇక్కడ ట్రెక్కింగ్ చేసేందుకు అవకాశం
- అందుబాటులో జంతువులు, పక్షుల సమాచార కేంద్రం
- అదనపు ఆకర్షణగా లోటస్‌పాండ్, వ్యూపాయింట్

నేటి తరానికి ప్రకృతిని పరిచయం చేస్తున్న బయోడైవర్సిటీ సెంటర్

(మధురవాడ, ఆంధ్రజ్యోతి)

ప్రకృతిని కాపాడితేనే మానవ మనుగడ. దీనిపై నేటి తరానికి అవగాహన కల్పించేందుకు వీలుగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మధురవాడ ఎన్‌వీపీ లా కళాశాల ఎదురుగా 2023 నవంబరులో బయోడైవర్సిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. తూర్పు కనుమల్లో నివసించే జంతువులు, విశేషమైన మొక్కలపై సందర్శకులకు ఇక్కడ అవగాహన కల్పిస్తారు. నగరంలో పుట్టి పెరిగిన చిన్నారులకు అడవులపై అవగాహన ఉండదు. వారికి అడవి ప్రాధాన్యత తెలియజేయడం, పకృతిలో మనిషితో పాటు పక్షులు, జంతువుల అవసరాన్ని వివరించేందుకు ఈ కేంద్రం దోహదపడుతోంది. అంతేకాదు కొండలు ఎక్కాలనే ఉత్సాహవంతులకు ట్రెక్కింగ్ అందుబాటులో ఉంది.



ఆకర్షిస్తున్న లోటస్‌పాండ్



బయోడైవర్సిటీ సెంటర్ ప్రవేశద్వారం

కంబాలకొండ అభయారణ్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ఔషధ మొక్కలు, రాశివనం, నక్షత్ర వనం, ఫైకస్‌గార్డెన్, ట్రెక్కింగ్‌తో పాటు కలువలకొలను (లోటస్‌పాండ్) కాక్టస్ మొక్కలు, జీవవైవిధ్యం తెలిపే కేంద్రం ఉన్నాయి. వెదురు ఉత్పత్తులు, పర్యావరణ హితమైన వస్త్రంతో తయారైన సంచులను ఇక్కడ విక్రయిస్తారు. నేటి చిన్నారులకు అడవిపై అవగాహన కల్పిస్తారు. హిందూ సంప్రదాయం ప్రకారం ఏ రాశి వారికి ఏ మొక్క నాటాలి, ఏ నక్షత్రం వారు ఏ చెట్టును పూజించాలో వివరించేందుకు వీలుగా ప్రత్యేకంగా రాశివనం, నక్షత్రవనం ఏర్పాటు చేశారు. ఇక్కడ 12 రాశులు, 27 నక్షత్రాలకు సంబంధించి మొక్కలను పెంచుతున్నారు. తూర్పు కనుమల్లో నివసించే జంతువులతో పాటు పాటు ప్రపంచవ్యాప్తంగా మనుగడ సాగిస్తున్న వన్యప్రాణులపై సందర్శకులకు కనీస అవగాహన కల్పించేందుకు వీలుగా సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పర్యాటకుల మదినిదోచే అందాలను వీక్షించేందుకు ఫొటోపాయింట్, వ్యూపాయింట్, తాగునీరు, టాయిలెట్లు, పిల్లల కోసం పార్కు నిర్మించారు.

ఇవీ సౌకర్యాలు..

బయోడైవర్సిటీ కేంద్రం సందర్శించే వారి కోసం తాగునీరు, టాయిలెట్లు, వ్యూపాయింట్, ఫొటో సెంటర్, సమాచార కేంద్రం, పిల్లల వినోదానికి పార్కు అందుబాటులో ఉన్నాయి. ప్రకృతి సోయగాలను ఆస్వాదించేవారికి , పచ్చదనం పరిడవిల్లే బయోడైవర్సిటీ కేంద్రం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

వనసంపద విక్రయ కేంద్రం..

ఈ కేంద్రంలో వెదురుతో తయారుచేసిన పెన్‌స్టాండ్‌తో పాటు గృహాలంకరణ వస్తువులు, ఆవు పేడ, కొబ్బరిపీచు, మట్టితో తయారుచేసిన అంద మైన పూలకుండీలు విక్రయిస్తున్నారు. మొక్కలు పెంచడం కోసం ఎనిమిది మంది గిరిజన యువతకు ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తున్నారు. పర్యావరణ హితమైన గుడ్డ సంచులను ఇక్కడ తయారుచేసి వినియోగదారులకు అందుబాటు ధరల్లో ఉంచారు.

మధురానుభవం ట్రెక్కింగ్..

కంబాల కొండ బయోడైవర్సిటీ సెంటర్ నుంచి జూ ఎదురుగా ఉన్న కంబాలకొండ వరకు సుమారు ఏడు కిలోమీటర్లు కొండలపై నడుచుకుంటూ వెళ్లేలా టెక్కింగ్ ఏర్పాట్లు చేశారు. యానిమల్ రెస్క్యూసెంటర్ వరకు మూడు కిలోమీటర్ల దూరం ట్రెక్కింగ్‌కు వీలుంది. అవసరమైన వారికి సహాయకులను సమకూరుస్తారు.

ప్రవేశ రుసుం...

బయోడైవర్సిటీ సెంటర్‌లో ప్రవేశించేందుకు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.15 రుసుం వసూలు చేస్తారు. కాగా ట్రెక్కింగ్‌కు ఒకరికి రూ.200 టికెట్ కొనుగోలు చేయాలి. ట్రెక్కింగ్‌కు వెళ్లేవారికి సహాయకులను ఇస్తారు. ఏడాది పొడవునా ఇక్కడ ప్రవేశం ఉంటుంది. సెలవులు అంటూ ఉండవు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సందర్శకులను అనుమతిస్తారు.



కంబాలకొండ అభయారణ్యంలో సందర్శకుల వ్యూపాయింట్



ట్రెక్కింగ్ చేస్తున్న ఔత్సాహికులు

రౌడీషీటర్‌పై దాడి కేసులో నలుగురి అరెస్టు

సీతంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతుండగా జరిగిన గొడవలో రౌడీ షీటర్‌ను ఇనుప రాడ్లు, కర్రలతో కొట్టి గాయపరిచిన సంఘటనలో నలుగురిని నాలుగో పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. రైల్వే న్యూకాలనీ క్వార్టర్స్ వద్ద గల సాయిబాబా ఆలయ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి రౌడీషీటర్ ఖాజా, ఈశ్వరరావు, మద్ది బెనర్జీ, గురునాథరెడ్డి, శివగణేష్, శివప్రసాద్ పేకాడుతున్నారు. ఈ క్రమంలో వారి మధ్య గొడవ జరిగింది. దీంతో ఖాజాను ఈశ్వరరావు తదితరులు ఇనుప రాడ్డు, కర్రలతో తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఖాజా వద్ద నుంచి రూ.22 వేలు నగదును కూడా లాక్కొని గాయపడిన అతడిని అల్లిపురం వాహనంపై తీసుకువెళ్లి డీఆర్ఎం కార్యాలయం సమీపంలో రోడ్డుపై పడేశారు. గమనించిన కొంత మంది ఖాజాను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. అతడు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనలో నిందితులుగా గుర్తించిన మద్ది బెనర్జీ, గురునాథరెడ్డి, శివగణేష్, శివప్రసాద్‌లను పోర్టు క్వార్టర్స్ ప్రాంతంలో సీఐ ఉమాపతి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం అదుపులో తీసుకున్నారు. ఈ నలుగురుని సీఐ ఉమాపతి ఆధ్వర్యంలో అరెస్టు చేశారు.

వినతులపై సత్వరం స్పందించాలి: జేసీ

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 328 అర్జీలు

మహారాణిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో కలిసి ఆయన ప్రజల నుంచి 328 వినతులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూ విభాగానికి సంబంధించి 98, జీవీఎంసీ 81, పోలీసు 23, ఇతర విభాగాలకు సంబంధించి 126 వినతులను ఉన్నాయి. అనంతరం అధికారులతో జేసీ సమీక్షిస్తూ గతంలో అందిన అర్జీల పరిష్కారానికి ఎవరు ఏయే చర్యలు తీసుకున్నారో శాఖల వారీగా అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. డీఆర్వో భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీలో వినతులు స్వీకరిస్తున్న మేయర్

జీవీఎంసీలో 106 వినతులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 106 వినతులు వచ్చాయని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. అర్జీలను/ఫిర్యాదులను అదే రోజు పరిశీలించి, గడువులోగా పరిష్కరించాలని అధికారులను మేయర్ ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న జేసీ మయూర్‌అశోక్

పోలీస్ కమిషనరేట్‌కు 110 ఫిర్యాదులు

మహారాణిపేట: నగర పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 110 ఫిర్యాదులు అందాయని సీపీ శంఖబ్రతబాగ్చి తెలిపారు. బాధితులనుంచి ఫిర్యాదులు స్వీకరించి, సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

సస్పెండైన అధికారులపై ముగిసిన దర్యాప్తు

అరిలోవ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్ర కారాగారంలో పనిచేసి సస్పెండైన అధికారులపై చేపట్టిన దర్యాప్తు సోమవారం ముగిసిందని డిప్యూటీ సూపరింటెండెంట్ సాయి ప్రవీణ్ తెలిపారు. గత రెండు రోజులుగా గుంటూరు డీఐసీ వరప్రసాద్, కడప జైలు సూపరింటెండెంట్ రాజేశ్వరరావు జైలులో సస్పెండైన అధికారుల పనితీరుపై దర్యాప్తు చేశారు. సోమవారం సాయంత్రం వరకు సాగిన దర్యాప్తు ముగిసిందని, జైళ్ల శాఖ డీజీకి నివేదిక సమర్పిస్తారని తెలిపారు.

మిస్ ఇండియా పోటీలకు సృజనాదేవి ఎంపిక

మహారాణిపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నవంబరులో రాజస్థాన్‌లో నిర్వహించనున్న ఫరెవర్ మిస్ ఇండియా పోటీలకు నగరానికి చెందిన డాక్టర్ సృజనా దేవి రాష్ట్రం తరఫున ఎంపికైనట్లు క్రియేటివ్ ప్లస్ సంస్థ ప్రతినిధి అజ య్ అగర్వాల్ సోమవారం తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో మిస్ వైజాగ్ పోటీలు కూడా త్వరలో నిర్వహిస్తామన్నారు. సెప్టెంబరులో ప్రాథమిక ఆడిషన్స్, నవంబరులో గ్రాండ్ ఫినాలే నిర్వహిస్తామని, ఇప్పటికే సుమారు వంద దరఖాస్తులు అందాయని అజయ్ అగర్వాల్ తెలిపారు.

పోర్టును సందర్శించిన నేపాల్ బృందం



నేపాల్ ప్రతినిధి బృందంతో పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేశ్‌కుమార్ దుబే

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేపాల్ కాన్సుల్ జనరల్ (కోల్‌కత్తా) ఝుక్కా ప్రసాద్ ఆచార్య, ఉపకాన్సుల్ జనరల్ జనక్‌రాజ్ భట్ట సోమవారం విశాఖపట్నం పోర్టు అథారిటీని సందర్శించారు. పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేశ్ కుమార్ దుబే వారిని స్వాగతించారు. పరిపాలనా భవనంలో సమావేశమై పోర్టు కార్యకలాపాలను వివరించారు. మౌలిక వసతులు, కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం, ఆధునికీకరణ, యాంత్రీకరణ, కవర్డ్ స్టోరేజీ సదుపాయాలు, సౌరవిద్యుత్ ప్రాజెక్టులు తదితర అంశాలను వివరించారు.

లులూకు భూ కేటాయింపులు రద్దుచేయాలి

- విశాఖ ప్రజావనరుల పరిరక్షణ వేదిక డిమాండ్

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డులో లులూ మాల్‌కు 13.74 ఎకరాల అత్యంత విలువైన ప్రభుత్వ భూముల కేటాయింపును రద్దు చేసి ఆస్థలంలో సైన్స్‌సిటీ నిర్మించాలని విశాఖపట్నం ప్రజావనరుల పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. అల్లూరి విజ్ఞానకేంద్రంలో వేదిక ఆధ్వర్యంలో సోమవారం ప్రజాభిప్రాయసేకరణ జరిగింది. ఈ సందర్భంగా వేదిక చైర్మన్ రాణిశర్మ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు, ఖజానాకు ధర్మకర్తగా ఉండాల్సిన ప్రభుత్వం రాష్ట్రంలో అత్యంత ఖరీదైన భూములను పందేరం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలన్నారు. తక్షణం లులూ కేటాయింపులను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, సీపీఐ సీనియర్‌నేత చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఆరోపించారు. సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి కేటాయింపులు జరిపారన్నారు. బీచ్‌ను ఆనుకుని ఉన్న రూ.13.74 ఎకరాల భూమిని ఏడాదికి కేవలం రూ.4.51 కోట్ల అద్దెకు ఇవ్వడంపై మండిపడ్డారు. ప్రభుత్వభూమిని కార్పొరేట్‌లకు పంచిపెడితేఊరుకోమని హెచ్చరించారు. ప్రభుత్వ విధానాలతో నష్టాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఏజే స్టాలిన్, వేదిక కన్వీనర్ సీఎస్ కేత్రపాల్, ఆర్‌కేఎస్‌వీ కుమార్, మాధవి, వనజాక్షి, బీబీ గణేష్, వెంకటలక్ష్మి, పౌర, ప్రజాసంఘాలు, కార్మికసంఘాల నేతలు, యువజన, విద్యార్థి, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వేదిక చైర్మన్ రాణిశర్మ

ఉక్కు ఉద్యోగులకు అందని జీతాలు

- మొత్తం బకాయిలు 430 శాతం

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఉద్యోగులతో గొడ్డు చాకిరీ చేయించుకొని జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదు. గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ పరిస్థితి నెలకొంది. ఆ నెలలో ఉద్యోగులకు కేవలం సగం జీతం ఇచ్చింది. అక్టోబరులో 35 శాతం, నవంబరులో 35 శాతం, డిసెంబరులో 35 శాతం, జనవరి 2025 నుంచి జూలై వరకు ప్రతి నెలా 25 శాతం కోత పెట్టి మిగిలిన జీతాలనే ఇస్తోంది. ఎంతో కొంత ఒకటో తేదీన ఇస్తున్నారని సరిపుచ్చుకున్న ఉద్యోగులకు ఈ నెల మళ్లీ మొండి చేయి చూపించింది. ఆగస్టు నెల జీతం సెప్టెంబరు ఒకటో తేదీన ఇవ్వాలి. కానీ ఇవ్వలేదు. మొత్తం ఈ జీతంతో కూడా కలుపుకొంటే 430 శాతం (అంటే నాలుగు నెలల జీతం కంటే ఎక్కువ) ఉద్యోగులకు చెల్లించాల్సి ఉంది. ఈ సీఎండీ వచ్చిన తరువాత ఏడాది పనిచేస్తే 7 నెలల 20 ఇరవై రోజులకు మాత్రమే జీతం ఇచ్చారు. సుమారు రూ.300 కోట్ల బకాయి ఉంది. రోజుకు 8 గంటలు డ్యూటీ కాగా ఇంకో నాలుగు గంటలు అదనంగా పనిచేయిస్తున్నారు. ఇదంతా ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారని ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు వాపోతున్నారు. ఆగస్టు 31న రూ.64 కోట్లను ఎన్ఎండీసీకి బదలాయించారు. ఉక్కుకు ఎన్ఎండీసీ ఐరన్‌ఓర్ సరఫరా చేస్తుంది. రూ.2 వేల కోట్ల బిల్లు బకాయి పెట్టుకునే వెసులుబాటుంది. మళ్లించిన ఆ మొత్తాన్ని జీతాలుగా ఇచ్చి అమ్మకాల ద్వారా వచ్చే మొత్తాన్ని అటు సర్దుబాటు చేసుకోవచ్చునని, కానీ యాజమాన్యం ఉద్యోగులను శత్రువులుగా చూస్తోందని ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు.

క్రైం... crime news

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



సుబ్రహ్మణ్యం (ఫైల్)

పెందుర్తి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):సరిపల్లి జాతీయరహదారి సర్వీసు రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో గాయపడిన కేశుబోయిన సుబ్రహ్మ ణ్యం (21) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. చినముషిడివాడ అంబేద్కర్‌నగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం సబ్బవరంలో డిగ్రీ చదువుతున్నాడు. డాన్సర్‌గా సంపాదనతో కుటుంబానికి ఆర్థిక ఆసరాగా నిలిచాడు. ఆదివారం పుట్టినరోజు కావడంతో అంబేడ్కర్ కాలనీకి చెందిన స్నేహితుడు దాలి శంకర్‌తో కలిసి వేడుకలు జరుపుకుని, బైక్‌పై ఇంటికి వస్తుండగా ఆటోను ఢీకొట్టాడు. కేజీహెచ్‌కు తరలించగా, సోమవారం మృతిచెందాడు. తన నేత్రాలను దానం చేయడంతో సేకరించారు. సుబ్రహ్మణ్యం తండ్రి శ్రీనివాసరావు కూలీ. తల్లి రాములమ్మ టిఫిన్ దుకాణం నడుపుతోంది. సోదరి షణ్ముఖి ఇంటర్ చదువుతోంది. ప్రమాదంలో గాయపడిన శంకర్ అపస్మారకస్థితిలోనే ఉన్నాడని సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు. ఆటోడ్రైవర్ కన్నయ్య, భార్య దేవి, కుమార్తె భారతి, కోడలు నాగమణి చికిత్స పొందుతున్నారు.

మద్యానికి బానిసై యువకుడి మృతి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికితోడు మద్యానికి బానిసైన ఓ యువకుడు మృతి చెందాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మింది ప్రాంతానికి చెందిన బొండపల్లి రమేష్ (28) సీతమ్మపేట వద్ద వసతిగృహంలో ఉంటూ, ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేసేవాడు. మద్యానికి బానిసై, గుండె, మానసిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్నాడు. ఇటీవల పని మానేశాడు. మద్యం తాగరాదని వైద్యులు హెచ్చరించినా, పది రోజులుగా పూటుగా తాగాడు. ఇసుకతోట పెట్రోలు బంకు సమీపంలో అంబులెన్స్ డ్రైవరుగా పనిచేస్తున్న లక్ష్మణ్ గదిలో కొద్దిరోజులుగా ఉంటున్నాడు. తాగుడుతో తీవ్ర అనారోగ్యానికి గురై, ఆదివారం అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. 108కి సమాచారం ఇవ్వడంతో వారు రమేష్‌ను పరిశీలించి మృతి చెందినట్టు ధ్రువీకరించారు. అతడి తల్లి బొండపల్లి లక్ష్మికి సమాచారం అందించింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి హెచ్‌సీ సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి అదృశ్యమయ్యాడని ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగ్గాలేని తన తండ్రి బస్సు నుంచి ఎక్కడో దిగిపోయాడని కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ మురళి తెలిపిన వివరాల మేరకు.. పెందుర్తి దరి చినముషిడివాడకు చెందిన పొట్లాడ తాతారావు (54) కుమార్తె సాయిశ్రీతో కలిసి ఆదివారం కేజీహెచ్‌కు వెళ్లేందుకు చినముషిడివాడ వద్ద 68కె నెంబరు బస్సు ఎక్కింది. వెనుక సీట్లో కూర్చున్న తాతారావు కేజీహెచ్‌కు వెళ్లేసరికి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెచ్‌సీ రామశంకర్ దర్యాప్తు చేస్తున్నారు.

భర్తతో తగాదా.. భార్య అదృశ్యం

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవ కారణంగా ఓ మహిళ అదృశ్యమయింది. సీఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. పెదవాల్తేరు కాగితాలవీధికి చెందిన సీహెచ్ ఎల్లారెడ్డి, భార్య అలివేణి(36) మధ్య ఆదివారం గొడవ జరిగింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎల్లారెడ్డి కుమారుడితో బయటకు వెళ్లి, తిరిగి రెండున్నర గంటల సమయంలో వచ్చేసరికి భార్య అలివేణి కనిపించలేదు. ఆమె ఫోన్ ఇంట్లోనే ఉంది. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. హెచ్‌సీ కె.నూకరాజు దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ మీడియాలో బాలికపై తప్పుడు ప్రచారం

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ఎండాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబద్వేషాలతో బాలికపై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నగరానికి చెందిన బాలిక ఫొటోను ఎడిట్ చేసి, ఆమెను కించపరిచేలా రూపొందించి ఆమె బావ ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశాడు. దీంతో బాలిక, ఆమె తల్లి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక అక్క భర్తే ఈ దుశ్చర్యకు పాల్పడినట్టు సాంకేతికతతో గుర్తించిన పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

పేకాట ఆడుతున్న 11 మంది అరెస్టు

సీతంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలోని సుబ్బయ్య గెస్ట్‌హౌస్‌లో పేకాట ఆడుతున్న వారిని టాస్క్‌ఫోర్స్ ద్వారకా పోలీసులు పట్టుకున్నారు. 11 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.72 వేలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ డి.వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.